

# జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా
Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా



సంపుటి - 07 | సంచిక 247 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం, 06, ఆగస్టు 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# అప్పుల రాష్ట్రంలో అవినీతి కుప్పలు!






జీతం తక్కువ దోపిడీ ఎక్కువ

ఎంత దోచుకుంటే అంత హీరోలు

అవినీతిపరులా మజాకా అవినీతి చేస్తూనే పదోన్నతులు పొందుతున్నారు

హద్దులు దాటుతున్న అవినీతి

సీఎం,బట్టి, పొంగులేటి, శాఖలో పెరిగిపోతున్న అవినీతి

అవినీతిపరులకు ఆదిత్యమిస్తున్న అధికారులు

రాజకీయం అధికార పలుకుబడి అవినీతి సామ్రాజ్యాలను స్థాపిస్తుంది

ఎంత అవినీతికి పాల్పడితే అన్ని అధికార పదవులు లభిస్తున్నాయి

తెలంగాణలో రికార్డు స్థాయిలో ె ఎరుగుతున్న అవినీతి

ఏసీబీ అధికారుల దాడులు మచ్చుకైనా పట్టించుకోని అవినీతిపరులు

అవినీతిపరులు ఆగడాలకు జడుసుకుంటున్న ప్రభుత్వ కార్యాలయాలు

నిజాయితీపరులను వెంటాడుతూ అవినీతి నిలువ దోపిడీకి పాల్పడుతున్నారు

గల్లీ నుండి మొదలుకొని ఢిల్లీ వరకు అవినీతిపరుల పైరవీలే

డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

అవినీతిని నిర్మూలించకపోతే అప్పుల రాష్ట్రం తిప్పలపడక తప్పదని డాక్టర్ బరిగెల శివ వ్యాఖ్యానించారు.అసలే రాష్ట్రం అప్పుల్లో కూరుకు పోతుంటే అవినీతిపరులంతా అవినీతికి ఆద్యం పోస్తూ వ్యవస్థలను పాడు చేస్తున్నారని మండిపడ్డారు.రాష్ట్ర అప్పులపై విశ్లేషిస్తున్న మేధావులంతా అవినీతిపరుల గురించి ప్రస్తావించకపోవడం రాష్ట్రంలో దౌర్భాగ్యపు వాతావరణం పెరిగిపోతుందన్నారు. అవినీతిపరులపై ఎప్పటికప్పుడు విశ్లేషణాత్మకమైన సంభాషణలు జరగాల్సి ఉండెనని పేర్కొన్నారు.గతంలో అవినీతి చేయాలంటే

- మిగతా 2లో..



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్





## హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ

8 ఇంటర్ కాలేజీలపై చర్యలకు ఆదేశం



4

## తెలంగాణలో డయల్ 112 సేవలు ప్రారంభం

పోలీస్,ఫైర్, అంబులెన్స్‌కు ఇక ఒక్కటే నంబర్
సేవలను ప్రారంభించిన డిజిపి సివి ఆనంద్




3

## సిఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన

షరతులతో అనుమతిచ్చిన ఎసిబి కోర్టు



7

## ఏసీబీ హిట్ లిస్ట్‌లో 65 మంది అధికారులు..!

త్వరలో దాడులకు రంగం సిద్ధం.. అధికారుల్లో ఆందోళన..!




హైదరాబాద్(జై భీమ్ డెస్క్)

రాష్ట్రంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దృష్టి సారించింది. వివిధ శాఖలకు చెందిన 65 మంది అధికారుల వివరాలతో ప్రత్యేక హిట్ లిస్ట్‌ను సిద్ధం చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. ఈ జాబితాలో ఉన్న అధికారుల ఆస్తులు, ఆర్థిక లావాదేవీలు, సేవా రికార్డులు, ఫిర్యాదులపై ఇప్పటికే ప్రాథమిక సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. అవసరమైతే త్వరలోనే ప్రత్యేక బృందాలతో సోదాలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఈ పరిణామంతో ప్రభుత్వ శాఖల్లో కలకలం నెలకొంది. అయితే, ఏసీబీ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem సామాన్యుడి ఆయుధంగా

# దురాశే సైబర్ నేరగాళ్లకు ఆయుధం..

**అప్రమత్తతే రక్షణ: ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి, డీసీపీ ధార కవిత**




**హన్మకొండ, 5 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

సైబర్ నేరగాళ్లు ప్రజల దురాశ, అవగాహన లేమిని ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని, అప్రమత్తతతో వ్యవహరిస్తేనే ఇటువంటి నేరాలను అరికట్టవచ్చని హనుమకొండ డీసీపీ ధార కవిత పేర్కొన్నారు. వ్యక్తిగత, బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని ఆమె ప్రజలకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సిబ్బందికి సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి, డీసీపీ ధార కవిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ ధార కవిత మాట్లాడుతూ, కంప్యూటర్లు, ఇంటర్నెట్, డిజిటల్ సేవల వినియోగం విస్తరించిన నేపథ్యంలో ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా సైబర్ నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని చెప్పారు. సైబర్ నేరగాళ్లు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, తక్కువ ధరలకు వస్తువుల విక్రయం, ఉద్యోగ అవకాశాలు, పెట్టుబడులపై అధిక లాభాలు వస్తాయంటూ ఆశ చూపించి ప్రజలను వలలో వేసుకుంటున్నారని వివరించారు. అనంతరం ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం, డెబిట్, క్రెడిట్ కార్డుల సమాచారం, వ్యక్తిగత వివరాలను ఫోన్ కాల్స్, సందేశాలు, నకిలీ లింకుల ద్వారా సేకరించి ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో కనిపించే పెట్టుబడి ప్రకటనలను గుడ్డిగా నమ్మవద్దని, అపరిచితులు పంపే లింకులను క్లిక్ చేయరాదని, ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత లేదా బ్యాంకు వివరాలను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ, ఉన్నత విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయనే పేరుతో మోసాలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపులో సైబర్ నేరాల నివారణకు అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ శ్రీనివాస్, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, హనుమకొండ, కాజీపేట ఏసీపీలు పింగిలి ప్రశాంత్ రెడ్డి, నరసింహారావు, డీఆర్‌డీఓ మేన శ్రీను, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ రైల్వే క్రాసింగ్ సమస్యలపై లోక్‌సభలో కడియం కావ్య ప్రశ్న

**రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిల పనులు వేగవంతం చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి**

**న్యూఢిల్లీ, 5 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**



వరంగల్ జిల్లాలో రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలను తగ్గించి, ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్ బ్రిడ్జిలు, లెవల్ క్రాసింగ్‌ల నిర్మూలన పనుల పురోగతిపై వరంగల్ ఎంపీ కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో జిల్లాలో ఆమోదించిన రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్ బ్రిడ్జిలు, లెవల్ క్రాసింగ్‌ల నిర్మూలన పనుల వివరాలు, వాటి అంచనా వ్యయం, నిధుల కేటాయింపు, పనుల పురోగతి, ఇప్పటివరకు ఖర్చు చేసిన నిధులు, పూర్తయ్యే గడువు వంటి అంశాలపై కేంద్ర రైల్వే శాఖ నుంచి వివరణ కోరారు. ఈ ప్రశ్నకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2026 జూన్ 1 నాటికి వరంగల్ జిల్లాలో మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, ఏడు రైల్వే అండర్ బ్రిడ్జిలు, ఎనిమిది లెవల్ క్రాసింగ్‌లు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో నాలుగు రైల్వే ఓవర్ బ్రిడ్జి, అండర్ బ్రిడ్జి పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని వెల్లడించారు. వరంగల్--చింతలపల్లి మధ్య 64వ లెవల్ క్రాసింగ్ వద్ద రూ.77 కోట్ల వ్యయంతో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ ఖరారైనట్లు తెలిపారు. అలాగే కాజీపేట--వరంగల్ మధ్య 60వ లెవల్ క్రాసింగ్, ఎల్గూర్--నెక్కొండ మధ్య 66, 67 లెవల్ క్రాసింగ్‌ల వద్ద మరో మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో చేపట్టినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.4,883 కోట్ల అంచనా వ్యయంతో 118 రైల్వే ఓవర్ బ్రిడ్జి, అండర్ బ్రిడ్జి పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నట్లు మంత్రి సమాధానంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ జిల్లాలో రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాల ముప్పు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి, అండర్ బ్రిడ్జి పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. టెండర్ పూర్తయిన పనులు, సాధారణ పరిపాలనా అనుమతి దశలో ఉన్న ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని కేంద్ర రైల్వే శాఖను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కూడా రైల్వే శాఖ పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ జిల్లా ప్రజలకు సురక్షితమైన, అంతరాయం లేని రవాణా సౌకర్యం కల్పించేందుకు పార్లమెంట్‌లో తన ప్రయత్నాలను నిరంతరం కొనసాగిస్తానని కడియం కావ్య స్పష్టం చేశారు.

# అప్పుల రాష్ట్రంలో అవినీతి కుప్పలు









మొదటి పేజీ తరువాయి

భయపడే వాళ్ళని కాలక్రమేనా అధికారం అంటేనే అవినీతి అనే స్థాయికి ప్రభుత్వ కార్యాలయాలు దిగజారిపోయాయని అధికారికంగా దోచుకోవడమే కాకుండా అనధికారకంగా దోచుకోవడం ప్రభుత్వ కార్యాలయాల వంతుగా అధికార వ్యవస్థ కొనసాగడం అధికారుల వ్యక్తిగత దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు.ఆయా ప్రభుత్వ శాఖలకు అధికారికంగా కేటాయించబడుతున్న ప్రభుత్వ సొమ్మును తప్పుడు బిల్స్ పెడుతూ ప్రభుత్వ సొమ్మునంత మాయం చేస్తున్నారని తీవ్రంగా హెచ్చరించారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన శాఖలన్నీ అవినీతి మయంలో కూరుకుపోతుండగా మేమేం తక్కువ కాదంటూ ప్రభుత్వ అధికారులు అవినీతి రొంపులో దూసుకుపోతున్నారని అన్నారు.ముఖ్యంగా మంత్రిత్వ శాఖలన్నీ పూర్తి అవినీతిమయానికి దగ్గరయిపోయాయని వాపోయారు.అభివృద్ధికి, అప్పులకు తెలంగాణ రాష్ట్రంలో చాలా వ్యత్యాసం కనిపిస్తుందని అవినీతి అనేది ఉన్న పాటుగా పతాక స్థాయికి చేరిపోతుండగా అభివృద్ధి కుంటుపడుతుందన్నారు.అదే సందర్భంలో అప్పులు విపరీతంగా పెరిగిపోతున్నాయని దాన్ని బట్టి చూస్తే అవినీతి ఒకవైపు అప్పులు ఒకవైపు, మందకోడి అభివృద్ధి మరోవైపు తెలంగాణ రాష్ట్రాన్ని ఊపిరాడకుండా చేస్తున్నాయన్నారు.కాంగ్రెస్ హయాంలో తారాసాయికి చేరిన అవినీతిని చూసి ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారన్నారు.2025 సంవత్సరపు రికార్డులను 26 సంవత్సరం ఆరు నెలల్లోనే అవినీతి రికార్డులను దాటవేసిందని దానికి నిదర్శనంగా ఆరు నెలల పాటు రాష్ట్రంలో జరిగిన ఏసీబీ కేసుల దాడులే ప్రధాన కారణంగా చూడవచ్చునన్నారు.తలసరి ఆదాయంలో ఒకప్పుడు ధాన్యం ఉత్పత్తుల్లో ఎంతో మెరుగైన లాభాలను పొందుకున్నామని,గ్రామీణ అభివృద్ధి క్రమక్రమంగా పెరిగేదని మెడికల్ కాలేజీల్లో రికార్డులు సృష్టించిన అభివృద్ధిని జ్ఞాపకం చేస్తూ,తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక నేరాల్లో మద్యం అమ్మకాల్లో అవినీతిలో టాప్ ర్యాంక్ సాధిస్తూ తలవంతులు చేస్తుందని బాధ వ్యక్తం చేశారు.అన్నిటికన్నా ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగా ప్రధానమంత్రిత్వ శాఖల స్థాయిలో విచ్చలవిడిగా అవినీతి పెరిగిపోతుండడంతో దానిని అదునుగా చేసుకొని పై స్థాయి ఉన్నతాధికారులు మొదలుకొని చిరు ఉద్యోగుల వరకు అవినీతిలో చెలరేగిపోతున్నారని పేర్కొన్నారు.2025 ఏడాది మొత్తంలో నమోదైన ఎసిబి కేసుల సంఖ్యను 2026 లో ఆరు నెలల్లోనే దాటేయడం చూస్తే కాంగ్రెస్ పాలనలో అవినీతి ఎంత దారుణంగా పెరిగిపోతుందో అర్థమవుతుందన్నారు.అవినీతి నిరోధక శాఖ అధికారులు అవినీతిపరుల భరతం పట్టడం జోరు పెరుగుతున్నప్పటికీ అవినీతి అధికారులకు ఏమాత్రం చలనం రావడం లేదని ఎంతటి అవినీతికి పాల్పడిన ఉద్యోగం పోదనే ధీమా ఉండడంతో అధికారుల అవినీతికి హొద్దు పద్దు లేకుండా పోతుందన్నారు.వాటితోపాటు సీఎం చేతిలో ఉన్న పోలీస్ శాఖ మున్సిపల్ శాఖ పొంగులేటి చేతిలో ఉన్న రెవెన్యూ శాఖ బట్టి చేతిలో ఉన్న ఫైనాన్స్ రెవెన్యూ శాఖలు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అవినీతిలో టాప్ స్థాయిలో ఉన్నాయని దీన్నిబట్టి పైనున్న మంత్రుల పరిస్థితి ఏమిటో ప్రజలు సునాయాసంగా తెలుసుకుంటున్నారన్నారు.

### అవినీతి అధికారులపై కొత్త చట్టం రావాలి..

అవినీతిపరులకు ఉద్యోగ బహిష్కరణ ఒక్కటే మార్గం అంటూ స్పష్టంగా గుర్తుచేశారు.2014 జూన్ 2 నుండి నేటి వరకు అవినీతిపరులుగా వెలుగొంది అవినీతి కేసుల్లో ఇరుక్కుంటూ జైలు జీవితాలను అనుభవించిన ఉద్యోగులను అధికారులను క్రింది స్థాయి ఉద్యోగులు ఏ ఒక్కరిని క్షమించకుండా, పేక్షించకుండా ఉద్యోగ బహిష్కరణ చేస్తే తప్ప అవినీతి అనేది అంతరించబడేలా లేదని హెచ్చరించారు.ప్రభుత్వాలు అవినీతి అధికారులపై ఎంతటి కఠినమైన చర్యలు చేపట్టిన అధికారులలో




మార్పు రాకపోవడానికి ప్రధాన కారణం అవినీతిపరులే రాజకీయ పరుపతి కలిగిన నాయకులకు సన్నిహితులుగా వెలుగొందుతున్నారని హెచ్చరించారు.ఏసీబీ అధికారుల దాడులు పెరుగుతున్న కొద్దీ అవినీతి కూడా పెరిగిపోతుందని ఏసీబీ అధికారుల కేసులను అవినీతిపరులు ఏమాత్రం పరిగణలోకి తీసుకోవడం లేదంటూ ఏ ప్రభుత్వ కార్యాలయంలో నైతే అవినీతి నిరోధక శాఖ అధికారులు అవినీతిపరులను అడ్డుకుంటున్నారో అదే శాఖలలో అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోతుందని దుయ్యపడ్డారు.విద్యాశాఖలో రెవెన్యూ శాఖలో పోలీస్ శాఖలో మున్సిపల్ శాఖలో అవినీతి కుంభకోణాలు ఊహించలేనివని వాటిని పెంచి పోషించడానికి ప్రత్యక్ష మార్గాలు జరుగుతుండగా ప్రతి ఉన్నతాధికారి ముందు అవినీతి సామ్రాజ్యాన్ని పెంచి పోషించడం కోసం కాస్తైనా సాంకేతిక పరిజ్ఞానం కలిగిన అధికారులు సహాయకులుగా ఉపయోగపడుతూ అవినీతి కుంభకోణాలను అభివృద్ధి చేయడంలో కీలకపాత్రను పోషిస్తున్నారని అన్నారు.రాజకీయ నాయకుల అండదండలతో పదవులు తెచ్చుకోవడం తెచ్చుకున్న పదవులలో మొదటి నుండి అవినీతికి పాల్పడడం ఆనవాయిదిగా పెట్టుకుంటున్నారని తీవ్రంగా విమర్శించారు.ఆంధ్రప్రదేశ్లో అయితే అవినీతి అనేది చెప్పడానికే వీరు లేకుండా పోతుందని ప్రతి ప్రభుత్వ స్కీములో స్కాముల గోల పెరిగిపోతుందన్నారు.ప్రతి విషయంలో అవినీతిని చేయకపోతే ప్రభుత్వాలు నడవలేవనే విధమైన సాకేతాలను ప్రజలకు చేరవేస్తూ అవినీతి సామ్రాజ్యాన్ని పెంచి పోషిస్తున్నారని మండిపడ్డారు.కాస్తయినా నిజాయితీని కనపరుస్తూ అవినీతిని నిర్మూలించబడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తే అవినీతిపరుల బహిరంగ అవినీతి రూపాలను నిర్మూలించగలమని లేని పక్షాన ఇచ్చలవిడిగా పెరిగిపోతున్న అవినీతిని ఎవరు అడ్డుకట్ట వేయలేరని స్పష్టం చేశారు.ఆస్తుల సంపాదనకు మరుగుతున్న ప్రతి ఒక్కరు అవినీతి సామ్రాజ్యాలను పెంచి పోషించడానికి ఉద్యోగ ధర్మాన్ని అధికార పదవులను వాడుకుంటున్నారని ప్రభుత్వ వ్యవస్థలను కాపాడడం కోసమైతే ఏమాత్రం కాదన్నారు.స్వయంగా ప్రధానమంత్రిత్వ శాఖలు అవినీతికి దగ్గరగా దారులు వేసుకుంటూ పోతుంటే సామాన్య ప్రభుత్వ కార్యాలయాలు వాటి పరిస్థితి ఏమిటంటే సూటిగా నిలదీశారు.రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే అప్పులు తెచ్చుకోవాలని తెచ్చుకున్న అప్పులను అభివృద్ధి కోసం వాడకుండా అవినీతిని పెంచి పోషించడం కోసం వాడబడుతున్నట్లుగా రాష్ట్ర ప్రజలు ఆందోళనను వ్యక్తపరుస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న ప్రతి ఒక్కరు ప్రభుత్వం నుండి కావాల్సినంత జీతాలు తీసుకుంటూ అధికారంలో కొనసాగుతూ ఉండడమే కాకుండా ప్రత్యక్షంగాను రాష్ట్రం అప్పుల పాలు కావడానికి ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోని ప్రజాధనాన్ని ప్రభుత్వ ధనాన్ని అవినీతి రూపంలో దండుకుంటూ వాటన్నిటికీ తప్పుడు బిల్లులను తప్పుడు ఆడిట్ విధానాలను రూపొందిస్తూ వ్యవస్థలను నిర్వీర్యం చేసే క్రమంలో ప్రభుత్వాన్ని రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నారని అలాంటి అధికార వ్యవస్థలపై క్షేత్రస్థాయి సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేస్తూనే రాష్ట్రంలో అవినీతికి పాల్పడిన ప్రతి ఉద్యోగిని ప్రతి అధికారిని ప్రతి సామాన్య ఉద్యోగిని ఉద్యోగం నుండి శాశ్వతంగా బహిష్కరించే చట్టం తీసుకొస్తే తప్ప ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల అవినీతి ఉద్యోగుల అవినీతి సాధారణ ఉద్యోగుల అవినీతి ఏమాత్రం తగ్గదనేది స్పష్టమవుతుందన్నారు.అధికారులే ఇలా ఉంటే రాజకీయ నాయకులు ఇంకెలా ఉంటారో రాష్ట్ర ప్రజలు ఎప్పుడో అంచనాలు వేసుకోగలిగారని తెలిపారు.అవినీతి చేస్తూ కమిటీలు వేయబడిన ప్రతి అధికారి పట్ల ప్రభుత్వంతోపాటు ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లోని పరిపాలన అధికారులు అప్రమత్తంగా ఉంటూనే అలాంటి అవినీతిపరులకు ఎలాంటి పదవులు కేటాయించకుండా వాళ్ళ కదలికలపై నిఘాలు వేస్తూ ఎప్పటికప్పుడు వాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడ కూడదన్నారు.ఏ ప్రభుత్వ శాఖలో చూసిన నిజాయితీగా పని చేసే ప్రభుత్వ అధికారులు నిందలపాలవుతూ అవినీతిని చివరి అంచుల వరకు ఆస్వాదించి ఎవరికీ అందనంత అవినీతి సొమ్మును సంపాదించుకొని అక్రమార్కులుగా వెలుగొందుతున్న ప్రతి ఒక్కరు నిజాయితీపరులుగా చలామని అవ్వడం కోసం అన్ని రకాల శక్తి యుక్తుల్ని సంపాదించుకుంటున్నారని విమర్శించారు.ప్రభుత్వ అవినీతి మంత్రుల అవినీతి ప్రభుత్వ కార్యాలయాల అవినీతి సాధారణ ప్రజల సొమ్మును దోచుకుంటున్నట్లుగా స్పష్టమైపోతుంది అన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు పునాధులు వేస్తున్నారు




**వాగ్దేవి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసుటికల్ సైన్స్ బొల్లి కుంట వరంగల్ కళాశాలలో ఘనంగా ఫేర్వెల్ పార్టీ ఉత్సాహలు**

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆచార్య గాదే సమ్మయ్య యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మా సుటికల్ సైన్స్ కాకతీయ యూనివర్సిటీ.**

**కార్యక్రమాన్ని ప్రారంభించిన ఫార్మసీ కళాశాల డాక్టర్ స్వప్న రెడ్డి**

**ఆకట్టుకుంటున నృత్య ప్రదర్శనలు,సాంస్కృతిక కార్యక్రమాలు.**

**వరంగల్ జై భీమ్ న్యూస్:–**

వాగ్దేవి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసికల్ సైన్స్ లో ఆరవ సంవత్సరం పూర్తి చేసుకున్నటువంటి ఫార్మా .డి విద్యార్థిని విద్యార్థులకు ఘనంగా వఫేర్వెల్ పార్టీ నిర్వహించారు. కార్యక్రమంలో వాగ్దేవి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వప్న రెడ్డి,ఫార్మా డీ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ ప్రత్యూష ఆచార్య సమ్మయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యా ఉద్యోగ రంగాలలో విజయాలు సాధించి కళాశాలకు మంచిపేరు తీసుకరావాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిథి ఆచార్య గాదె సమ్మయ్య మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో క్రమశిక్షణ,కృషి, ఆత్మవిశ్వాసం తో ముందుకు సాగాలని సూచించారు,మన జీవిత మనుగడకు, ఉన్నత విద్యను పూర్తి చేయడానికి ఎంతో కష్టపడి చదివించిన తల్లిదండ్రుల కి మంచి పేరు తీసుకురావాలని వారికి సరైన గౌరవం ఇవ్వాలని కోరారు, అదేవిధంగా భవిష్యత్తు లో నిబద్ధత తో కూడిన పరిశోధనలు చేసి శాస్త్రీయ దృక్పథన్నీ పెంపొందించుకోవాలని, మన శరీరం శాశ్వతం కాదు, కానీ ఫార్మసి విద్యార్థులకు మంచి అవకాశం ఉంది అని, సైన్స్ రూపంలో మనం ఎల్లకాలం బతికి ఉండొచ్చని అది ముఖ్యంగా రీసెర్చ్ లో మనం కనబరిచే ప్రతిభ పై ఆధారపడి ఉంటుందని, నేషనల్, ఇంటర్నేషనల్ ఆర్టికల్ రూపంలో మనం ఎల్లకాలం జీవించి ఉండవచ్చని, అలాంటి రీసెర్చ్ మీరు చేయాలని సూచించారు. ప్రపంచ దేశాలు కోవిడ్ 19, ఎబోలా, క్యాన్సర్, డయాబెటిస్, న్యూరో డి జనరేటివ్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్,వైరల్ ఇన్ఫెక్షన్ కు కావలసిన మందులు అన్వేషన్లో ఉంది అని అందులో మీరు కూడా భాగస్వాములు కావాలని సైంటిఫిక్ మెథడాలోజిని పాటిస్తూ కొత్త మందులు కనుకోవాలని, ఫార్మసిస్ట్ గా ప్రజలకు రేషనల్ యూజెస్ ఆఫ్ మెడిసిన్ గురించి తెలియజేయాలని ముఖ్యంగా డయాబెటిక్, క్యాన్సర్, గుండె జబ్బులకు సంబంధించిన మందుల గురించి తెలియజేయాలని, రీసెర్చ్ చేస్తున్నప్పుడు డాక్యుమెంటేషన్ మరియు సైంటిఫిక్ ఎవిడెన్స్ రికార్డు చేయాలని వాలిడేషన్ పాటించాలని తెలియజేశారు. ఫార్మసిస్ట్ సేవలు చేస్తున్నప్పుడు, రిసర్చ్ విధానం పాటిస్తున్నప్పుడు నిజాయితీగా నిబద్ధతతో, క్రమశిక్షణతో కూడిన ఆశయమును ముందుకు తీసుకెళ్లాలని, ఫార్మసిస్ట్ సేవలు భారతదేశానికి చాలా ముఖ్యమని, ఫార్మసిస్టులు వెన్నెముక లాంటి వారు, ఫ్రంట్ లైన్ వారియర్ అని, హెల్త్ కేర్ సిస్టం మొట్టమొదటిగా కాపాడేది ఫార్మసిస్టులే, హిడెన్ డాక్టర్ గా ప్రైమరీ డాక్టర్ గా సేవలందిస్తారని, డాక్టర్, ఫార్మసిస్ట్, కలిసి విదేశాల మాదిరిగా భారతదేశంలో సేవలు అందించినచొ, భారతదేశంలో 100 శాతం ఆరోగ్యం పరిరక్షించవచ్చని విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఫార్మసీ విద్యార్థిని విద్యార్థులకు బంగారు భవిష్యత్తు క్లినికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, డ్రగ్ రెగ్యులేటరీ, ఫార్మకో విజిలెన్స్, సాస్ కోర్సెస్, మెడికల్ కోడింగ్, ఇవే కాకుండా క్లినికల్ ఫార్మసిస్ట్, డ్రగ్స్ ఇన్స్పెక్టర్, అనలిస్ట్, వంటి ఉద్యోగ అవకాశాలే కాకుండా గ్రూప్ ,బి గ్రూప్ ఏ, సివిల్ సర్వీస్ వంటి రంగాలలో కూడా ఉద్యోగ అవకాశాలకు అవకాశం ఉందని, వాటికి కూడా మీరు ప్రిపేర్ కావచ్చు అని తెలియజేశారు. భారతీయ సాంప్రదాయానికి గౌరవిస్తూ, పాటిస్తూ, నిజాయితీతో కూడిన జీవన విధానాన్ని కొనసాగిస్తూ, సమాజ శ్రేయస్సు కొరకు పాటుపడాలని, కోరికలకు దూరంగా ఉంటూ గౌతమ బుద్ధుని ఆలోచన విధానాన్ని పాటిస్తూ, జీవన విధానాన్ని కొనసాగించాలని ఉద్దేశించి ప్రసంగించారు. ఆరు సంవత్సరాల డిగ్రీని పూర్తి చేసి మంచి ప్రతిభ కనబరిచి కాలేజీకి, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తెచ్చినందుకు గాను వాగ్దేవి ప్రిన్సిపాల్ స్వప్న రెడ్డి, ఫార్మా డి హెడ్ డాక్టర్ ప్రత్యూష విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులు పాటలు, నృత్యాలు, నాటికలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సీనియర్ విద్యార్థులు కళాశాలలో, హాస్పిటల్ లో గడిపిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. చివరగా విద్యార్థులకు కళాశాల అధ్యాపక బృందం విద్యార్థుల యొక్క ఉజ్వల భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. ఆనందోత్సాహాల నడుమ జరిగిన ఈ వీడ్కోలు వేదిక విద్యార్థులందరికీ చిరస్మరణీయంగా నిలిచింది. కార్యక్రమంలో సీనియర్ ఆచార్యులు డాక్టర్ విజిత , డాక్టర్ రత్నాకర్ , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొనినారు, కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# డాక్టర్స్ కాలనీలో డెంగ్యూ నివారణకు ప్రత్యేక వైద్య శిబిరం




**దేశాయిపేట, చింతల్ యూపీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ డా. బి. రాజారెడ్డి**

**వరంగల్, 5 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ నగరంలోని 2వ డాక్టర్స్ కాలనీలో డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదైన నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డా. బి. రాజారెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేయడంతో పాటు డెంగ్యూ నివారణ చర్యలపై విస్తృత అవగాహన కల్పించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ డా. బి. రాజారెడ్డి శిబిరాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. పరిసర ప్రాంతాల్లో జ్వర సర్వేను వేగవంతం చేయాలని, ప్రతి ఇంటిని సందర్శించి జ్వర లక్షణాలు ఉన్న వారిని వెంటనే గుర్తించి పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. దోమల నివారణకు యాంటీ లార్వల్ చర్యలు, ఫాగింగ్ చేపట్టడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత, దోమల నివారణపై విస్తృతంగా అవగాహన కల్పిస్తూ అన్ని నివారణ చర్యలను సమన్వయంతో అమలు చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా దేశాయిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)ను డా. రాజారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇమ్యునైజేషన్ సెషన్‌ను పర్యవేక్షించి టీకాల నిర్వహణ, లబ్ధిదారుల నమోదు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. అలాగే వైద్య శిబిరం పనితీరును తనిఖీ చేసి, సీజనల్ వ్యాధుల నివారణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. అనంతరం చింతల్ యూపీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌ఓ అక్కడి రికార్డులను తనిఖీ చేసి, డెంగ్యూ, ఇతర సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు, పనితీరును మరింత మెరుగుపరిచేలా తగిన సూచనలు చేశారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని డా. బి. రాజారెడ్డి సూచించారు. జ్వరాలతో బాధపడుతున్న ప్రతి వ్యక్తికి సకాలంలో వైద్య సేవలు అందించాలని, ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నీరు నిల్వ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేశాయిపేట యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా. భరత్ కుమార్, చింతల్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా. దిలీప్ కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ కె. కుమారస్వామి, హెచ్‌ఈఓ సదానందం, జీహెచ్‌ఎంసీ హెల్త్ ఇన్‌స్పెక్టర్ మధూకర్, సీఓ కోర్నెల్ తదితర వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణలో డయల్ 112 సేవలు ప్రారంభం

**పోలీస్,ఫైర్, అంబులెన్స్‌కు ఇక ఒక్కటే నంబర్ సేవలను ప్రారంభించిన డిజిపి సివి ఆనంద్**

**హైదరాబాద్,ఆగస్ట్5(జై భీమ్ న్యూస్):**

తెలంగాణలో డయల్ 112 సేవలు అందుబాటగులోకి వచ్చాయి. ఏ ఫిర్యాదుకైనా ఇక 112 ద్వారా సమాధానం వస్తుంది. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. డయల్ 112 ద్వారా 18 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. న్యాయసాయం, వైద్యసాయం, సైబర్‌సాయం అనేక సమస్యల పరిష్కారాలకు డయల్ 112 పరిష్కార మార్గమని వ్యాఖ్యానించారు. డయల్ 112కు ఫోన్ చేసినప్పుడు పోలీసులు దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఒకే వ్యవస్థలోకి పోలీస్, ఫైర్, అంబులెన్స్ సేవలు, టిజిఐసిసి నుంచి డయల్ 112 సేవలను పర్యవేక్షి స్తామని డీజీపీ తెలిపారు. ప్రజల భద్రత, అత్యవసర స్పందన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. డయల్ 112 ఫోన్ రాగానే కాలర్ లొకేషన్ కోసం అడ్వాన్స్ ఆల్స్ వాడుతున్నామని పేర్కొన్నారు. డ్రోన్ బెస్ట్ టెక్నికల్ సిస్టంను త్వరలోనే తెలంగాణ పోలీసులు ఉపయోగిస్తారని వివరించారు. డ్రోన్ టీమ్‌ను సైతం ఏర్పాటు చేయబోతున్నామని చెప్పుకొచ్చారు. డయల్ 112 అనేది 3.0 వర్షన్‌గా ఉంటుందని తెలిపారు. యువ ఏపీఎస్‌లు, ఏఐ టెక్నాలజీ వాడే వారిని ఇందులో భాగస్వామ్యం చేయబోతున్నామని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు. బేసిక్ పోలీసింగ్ లాగా టెక్నాలజీ పోలీసింగ్‌ను అమల్లోకి తీసుకువస్తున్నామని వ్యాఖ్యానించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ టవర్‌లో రెండు ఫ్లోర్‌లను డయల్ 112కి కేటాయించామని తెలిపారు. డయల్ 100ను 2013లో కొంపల్లిలో జివికె వారి సాయంతో ప్రారంభించామని ప్రస్తావించారు. వివిధ అత్యవసరాలకు ఒకే నంబర్ ఉండాలని గతంలో కేంద్రప్రభుత్వం సూచించిందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టెక్నికల్ డెవలప్‌మెంట్ చేస్తూ వచ్చామని అన్నారు. ఇటీవల ఏఐ వచ్చాక అనేక పనులు సులువుగా అయిపోతున్నాయని డీజీపీ ఆనంద్ వెల్లడించారు.



## పసిపిల్లలకు ముర్రుపాలే తొలి ఆహారం..

**తల్లిపాలే ఉత్తమ పోషణ: డాక్టర్ అనితా రెడ్డి**




**భీమారం, 5 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

పుట్టిన ప్రతి శిశువుకు తల్లిపాలే తొలి ఆహారంగా అందించాలని, ముఖ్యంగా పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు (కొలస్ట్రం) శిశువుకు తప్పనిసరిగా ఇవ్వాలని అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా భీమారం కేయూ సమీపంలోని అంగనవాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత, తల్లిపాలు ఇస్తున్న సమయంలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తూ తల్లిపాల ప్రాధాన్యతపై విస్తృతంగా ప్రచారం చేస్తోందన్నారు. అయితే ప్రస్తుతం సరైన అవగాహన లేక చాలామంది తల్లులు డబ్బాపాలపై ఆధారపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధుల నుంచి రక్షిస్తాయని తెలిపారు. ముఖ్యంగా పుట్టిన వెంటనే వచ్చే పసుపు రంగు ముర్రుపాలు అత్యంత విలువైనవని, వాటిని పారబోసకుండా తప్పనిసరిగా శిశువుకు అందించాలని సూచించారు. గతంలో ఉమ్మడి కుటుంబాల్లో పెద్దలు గర్భిణీలు, బాలింతలకు అవసరమైన సూచనలు చేసేవారని, ప్రస్తుతం చిన్న కుటుంబాల కారణంగా ఆ అవగాహన తగ్గిపోయిందన్నారు. గర్భధారణ సమయంలో సరైన పోషకాహారం తీసుకోకపోవడం, జంక్ ఫుడ్ అలవాట్లు పెరగడం వల్ల తక్కువ బరువుతో పిల్లలు పుట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయని చెప్పారు. అంగనవాడీ టీచర్లు, సిబ్బంది గృహ సందర్శనలు నిర్వహిస్తూ గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం, తల్లిపాల ప్రాముఖ్యతపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నారని, ప్రజలు వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పిల్లలకు ఆహారం తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాల్సిన విధానాన్ని ప్రదర్శించి వివరించారు. బాలింత ఇంటికి వెళ్లి తల్లి, శిశువు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను తెలియజేశారు. అంగనవాడీ కేంద్రంలోని చిన్నారుల బరువును పరిశీలించి వారి ఎదుగుదలను అంచనా వేశారు. ప్రభుత్వం అంగనవాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల్లో పోషకాహార లోపం నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ప్రతి చిన్నారి ఆరోగ్యవంతంగా ఎదిగేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని డాక్టర్ అనితా రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ టీచర్లు, సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## ఎం.జె.పి. బాలికల పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం

**53 మంది విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు**

**డెంగ్యూ, మలేరియా నివారణపై అవగాహన**




**కమలాపూర్, 5 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఎం.జె.పి. బాలికల పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమలాపూర్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైద్యాధికారి డాక్టర్ నాగరాజు పర్యవేక్షించారు. శిబిరంలో మొత్తం 53 మంది విద్యార్థినులకు మలేరియా, డెంగ్యూ నిర్ధారణ పరీక్షలతో పాటు హీమోగ్లోబిన్ (హెచ్‌బీ) స్థాయి పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సమస్యలు గుర్తించిన విద్యార్థినులకు ఉచితంగా మందులు పంపిణీ చేసి, అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు హెచ్‌పీవీ టీకా ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలు, సీజనల్ వ్యాధుల లక్షణాలు, నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. పరిశుభ్రమైన పరిసరాలు, సురక్షితమైన తాగునీరు వినియోగించడం, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, దోమల పెరుగుదలను అరికట్టడం ద్వారా మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని వైద్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుణ్, హెచ్‌ఈఓ రవీందర్, హెచ్‌వీ అమృత, టీబీ నోడల్ పర్సన్ ప్రభాకర్, హెల్త్ అసిస్టెంట్లు రవీందర్, రాము, గోవర్ధన్ బాబు, పాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య, స్టాఫ్ నర్స్ అనితతో పాటు ఆరోగ్య శాఖ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి ప్రత్యేక వైద్య శిబిరాలు నిరంతరం నిర్వహిస్తామని వైద్యాధికారులు తెలిపారు.

జై భీమ్
POWER OF PEOPLE
Jai Bheem

## హైడ్రా కమిషనర్ సంతకం ఫోర్జరీ ఘటనపై దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి: ఏఐవైఎఫ్



**హైద్రాబాద్, 5 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

హైడ్రా కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ఫైర్ ఎన్‌వోసీలను ఇంటర్ బోర్డుకు సమర్పించిన ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల వ్యవహారం రాష్ట్ర విద్యా వ్యవస్థను కుదిపేసే అత్యంత తీవ్రమైన నేరమని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ, ప్రభుత్వ అధికారుల సంతకాలను నకిలీ చేసి అనుమతులు పొందే స్థాయికి విద్యా మాఫియా బరితెగించిందంటే ప్రభుత్వ పర్యవేక్షణ ఎంత దారుణంగా విఫలమైందో అర్థమవుతోందన్నారు. వేలాది మంది విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతూ నకిలీ పత్రాలతో కళాశాలలు నడపడం క్షమించరాని నేరమని పేర్కొన్నారు. ఇలాంటి విద్యాసంస్థలపై కేవలం కేసులు నమోదు చేయడం సరిపోదని, వెంటనే గుర్తింపును రద్దు చేసి సంబంధిత కళాశాలల యాజమాన్యాలపై కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు మరో 60 కళాశాలల ఫైర్ ఎన్‌వోసీలను కూడా పరిశీలిస్తున్నట్లు ప్రకటించడం పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తోందన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో స్వతంత్ర విచారణ జరిపించాలని, నకిలీ పత్రాల మాఫియాకు సహకరించిన అధికారులు, కళాశాల యాజమాన్యాలను చట్టం ముందు నిలబెట్టాలని కోరారు. విద్యార్థుల భద్రత, విద్యా ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల అనుమతులు, ఫైర్ ఎన్‌వోసీలు, భవన భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమాలకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

## హసన్‌పర్తిలో పంటల క్షేత్ర ప్రదర్శన..

రైతులకు శాస్త్రవేత్తల కీలక సూచనలు

పత్తి, పెసర, వరి పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు.. శాస్త్రీయ యాజమాన్యంపై రైతులకు అవగాహన



**హన్మకొండ, 5 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి మండలం నాగారం, ముచ్చెర్ల గ్రామాల్లో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం (ఆర్ఏఆర్ఎస్), వరంగల్ ఆధ్వర్యంలో పంటల క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి, పెసర, వరి, కంది పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన శాస్త్రవేత్తలు రైతులకు పంటల సంరక్షణ, చీడపీడలు, తెగుళ్ల నివారణపై శాస్త్రీయ సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం (టీకేవీకే), హనుమకొండ కోఆర్డినేటర్ డా. ఈ. నర్సయ్య, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డా. వై. హరి, డా. జె. భార్గవి, డా. డి. వీరన్న, హనుమకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు ఆదిరెడ్డి, వ్యవసాయ అధికారి అనురాధ, వ్యవసాయ విస్తరణ అధికారి శైలజ పాల్గొన్నారు. క్షేత్ర పరిశీలనలో ప్రస్తుతం పత్తి పంట పూత దశలో ఉండగా పచ్చదోమ, పేనుబంక పురుగుల ఉధృతి కనిపించినట్లు గుర్తించారు. వీటి నివారణకు డయాఫెంథియూరాన్ 1.25 మి.లీ.తో పాటు 1500 పీపీఎం వేపనూనె 5 మి.లీ.ని ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. పెసర పంట పూత నుంచి కాయ దశలో ఉండగా పల్లాకు (వైఎంవీ) తెగులు, మారుక గూడు పురుగు ఉధృతి ఉన్నట్లు గుర్తించారు. వీటి నివారణకు ఫ్లూబెండియామైడ్ 0.2 మి.లీ.తో పాటు 1500 పీపీఎం వేపనూనె 5 మి.లీ.ని ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వరి పంట ప్రస్తుతం నాట్లు వేసే దశ నుంచి పిలక దశలో ఉండటంతో ఈ దశలో క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 జీ గుళికలను ఎకరానికి 4 కిలోల చొప్పున వేయాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. పంటలను తరచుగా పరిశీలిస్తూ చీడపీడలు, తెగుళ్లు ప్రారంభ దశలోనే గుర్తించి వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహాల మేరకు సమగ్ర యాజమాన్య చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. ఈ క్షేత్ర ప్రదర్శనలో ఆత్మ (ఎటిఎంఎ) సభ్యుడు మల్లాడి లింగారెడ్డి, రైతులు నల్లపు రవీందర్ రెడ్డి, నేతాని ఉమాతో పాటు నాగారం క్లస్టర్‌కు చెందిన పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. రైతులు తమ పంటలకు సంబంధించిన సమస్యలను శాస్త్రవేత్తలతో చర్చించి, ఆధునిక సాగు పద్ధతులు, సమగ్ర చీడపీడల యాజమాన్యంపై అవగాహన పొందారు. రైతుల దిగుబడులు పెరగడంతో పాటు సాగు ఖర్చులు తగ్గించే దిశగా ఇటువంటి క్షేత్ర ప్రదర్శనలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని శాస్త్రవేత్తలు తెలిపారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తతే ఆర్థిక నష్టాలకు అడ్డుకట్ట






హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్

ఎస్సార్ యూనివర్సిటీలో సైబర్ భద్రతపై అవగాహన సదస్సు

“సురక్ష కా తిరంగా - ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్” ప్రచారంలో భాగంగా విద్యార్థులకు కీలక సూచనలు

**హసన్‌పర్తి, 5 ఆగస్టు 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయని, ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు డిజిటల్ లావాదేవీలు, సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉంటేనే ఆర్థిక నష్టాలను నివారించగలరని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న “సురక్ష కా తిరంగా – ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్” అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్సార్ యూనివర్సిటీలో సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో బ్యాంకింగ్ సేవలు, యూపీఐ చెల్లింపులు, ఆన్‌లైన్ షాపింగ్, సోషల్ మీడియా వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు కూడా కొత్త కొత్త పద్ధతులతో ప్రజలను మోసగిస్తున్నారని తెలిపారు. మొబైల్ ఫోన్‌లకు వచ్చే గుర్తుతెలియని లింకులు, నకిలీ వెబ్‌సైట్లు, ఫిషింగ్ సందేశాలు, ఉద్యోగాలు, పెట్టుబడులు, లాటరీలు, కూరియర్‌లు, కేవైసీ అప్‌డేట్ పేర్లతో వచ్చే కాల్స్, మెసేజ్‌లను నమ్మి వ్యక్తిగత వివరాలు పంచుకోవడం వల్ల భారీ ఆర్థిక నష్టాలు సంభవిస్తున్నాయని హెచ్చరించారు. బ్యాంకు ఖాతా వివరాలు, డెబిట్, క్రెడిట్ కార్డు నంబర్లు, ఓటీపీలు, యూపీఐ పిన్, ఏటీఎం పిన్ వంటి అత్యంత గోప్యమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియా ద్వారా పరిచయమయ్యే అపరిచితులతో ఆర్థిక లావాదేవీలు చేయకూడదని, అధిక లాభాలు వస్తాయని చెప్పే పెట్టుబడి యాప్‌లు, ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్‌లు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో వచ్చే ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. తెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం లేదా అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయడం వల్ల వ్యక్తిగత సమాచారం దొంగిలించబడే ప్రమాదం ఉందన్నారు. సైబర్ మోసానికి గురైన వెంటనే సమయాన్ని వృథా చేయకుండా జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే కేంద్ర హోం శాఖ నిర్వహిస్తున్న అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. మోసం జరిగిన వెంటనే, ముఖ్యంగా “గోల్డెన్ అవర్”లో ఫిర్యాదు అందితే బ్యాంకులు, సంబంధిత సంస్థల సమన్వయంతో నగదు బదిలీని నిలిపివేసి బాధితులకు డబ్బు తిరిగి అందించే అవకాశాలు అధికంగా ఉంటాయని వివరించారు. విద్యార్థులు డిజిటల్ ప్రపంచంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడంతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్సార్ యూనివర్సిటీ సైబర్ సెక్యూరిటీ కోఆర్డినేటర్ ఎం. సంపత్ కుమార్ మాట్లాడుతూ, డిజిటల్ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో, అదే స్థాయిలో సైబర్ నేరాల ముప్పు కూడా పెరుగుతోందని అన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లతో పాటు టూ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ (2ఎఫ్ఎ)ను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, లింకులు, ఫోన్ కాల్స్‌ను నమ్మి వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ సమాచారం పంచుకోవద్దని హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికలపై నకిలీ ప్రొఫైల్‌లు, డీప్‌ఫేక్ వీడియోలు, ఆన్‌లైన్ పెట్టుబడులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, గేమింగ్ యాప్‌ల పేరుతో జరుగుతున్న మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సైబర్ నేరాలను అరికట్టడంలో పోలీసులతో పాటు విద్యాసంస్థల పాత్ర కూడా కీలకమని, ఎస్సార్ యూనివర్సిటీలో విద్యార్థుల్లో డిజిటల్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు తరచూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సురక్షితమైన డిజిటల్ సమాజ నిర్మాణంలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్ యూనివర్సిటీ పీఆర్ఓ (వీసీ) వి. మహేష్, డీన్ (స్టూడెంట్ వెల్ఫేర్) డా. ఎ.వి.వి. సుధాకర్, డిప్యూటీ రిజిస్ట్రార్ బి. శరత్ కుమార్, డీన్ (డిసిప్లిన్) లెఫ్టినెంట్ ఎ. రాజేశ్వరరావు, హసన్‌పర్తి పోలీస్ అధికారులు, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం హసన్‌పర్తి పోలీస్ అధికారులు, ఎస్సార్ యూనివర్సిటీ ప్రతినిధులు కలిసి “సురక్ష కా తిరంగా -- ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్” ప్రచారంలో భాగంగా సైబర్ అవేర్‌నెస్ పోస్టర్లను ఆవిష్కరించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతా నియమాలను పాటిస్తూ డిజిటల్ మోసాలను అరికట్టడంలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## ఆగస్టు 15లోపు బూత్, విలేజ్, మండల కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలి: ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

**హన్మకొండ, 5 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**



టీపీసీసీ ఆదేశాల మేరకు బూత్, విలేజ్, మండల స్థాయి కాంగ్రెస్ కమిటీల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం హనుమకొండలోని డీసీసీ కార్యాలయంలో మండల అధ్యక్షులు, డీసీసీ ఇంచార్జ్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి టీపీసీసీ జనరల్ సెక్రటరీ, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి పల్లె శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి, వర్ధన్నపేట ఇంచార్జి కూచన రవళి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హుస్నాబాద్, స్టేషన్ ఘనపూర్, వర్ధన్నపేట, పరకాల, హుజూరాబాద్, భూపాలపల్లి నియోజకవర్గాల పరిధిలోని మండల అధ్యక్షులు, డీసీసీ ఇంచార్జ్ కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయి కమిటీల ఏర్పాటు అత్యంత కీలకమని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బూత్, విలేజ్, మండల కమిటీలు ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. అధిష్టానం నిర్దేశించిన గడువు తక్కువగా ఉన్నందున అన్ని కమిటీల ఏర్పాటును ఆగస్టు 15లోపు తప్పనిసరిగా పూర్తి చేయాలని మండల అధ్యక్షులకు సూచించారు. ప్రతి మండల కమిటీలో సభ్యుల సంఖ్య 21 మందికి మించకుండా చూడాలని, డీసీసీ అధ్యక్షుడి కోటా కింద ఐదుగురు సభ్యులను నామినేట్ చేసే అవకాశం ఉండటంతో మండల అధ్యక్షులు తనతో సమన్వయం చేసుకోవాలని కోరారు. అలాగే ఒక ఉపాధ్యక్షుడిని నియమించే వెసులుబాటు కూడా ఉందని చెప్పారు. కమిటీల ఏర్పాటులో సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి కమిటీలో కనీసం 30 శాతం మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. మహిళలు లేని కమిటీలను అధిష్టానం ఆమోదించదని స్పష్టం చేశారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించి అన్ని వర్గాల సమతుల్య భాగస్వామ్యంతో కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీల నియామకం పూర్తైన అనంతరం ఆగస్టు 15 నుంచి 31 మధ్య తొలి అధికారిక మండల కమిటీ సమావేశాలను నిర్వహించాలని ఆదేశించారు. కమిటీల నియామకంలో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేల సూచనలు తీసుకుంటూ, మండల అధ్యక్షులు, ఇంచార్జ్ కమిటీ సభ్యులు పరస్పర సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. అర్హత, కష్టపడి పనిచేసే నాయకులకు కమిటీల్లో అవకాశం కల్పించాలని, ఏఐసీసీ మార్గదర్శకాలను పాటించని కమిటీలకు ఆమోదం ఇవ్వబోనని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి స్పష్టం చేశారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ

8 ఇంటర్ కాలేజీలపై చర్యలకు ఆదేశం

**హైదరాబాద్,ఆగస్ట్5(జై భీమ్ న్యూస్):**

హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. దాదాపు ఎనిమిది ప్రైవేటు కాలేజీలు.. రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేశాయి. హైడ్రా పేరును దుర్వినియోగం చేస్తూ నకిలీ ఫై÷ర్ ఎన్‌వోసీలను సృష్టించిన కళాశాలలు.. వాటిని ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించాయి. ఈ విషయం గుర్తించిన అధికారులు దీనిపై విచారణ చేపట్టగా.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ చేసినట్లు నిర్ధారించారు. దీంతో నకిలీ పత్రాలు సమర్పించిన ఎనిమిది ప్రైవేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఈ ఘటనపై లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఫోర్జరీ, నకిలీ పత్రాల సృష్టి తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హైడ్రా పేరుతో నకిలీ ఫైర్ నో అ÷-జబెక్షన్ సర్టిఫికెట్లు సృష్టించి ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించిన అధికారులు 8 ప్రైవేటు జూనియర్ కాలేజీలపై కేసు నమోదు చేశారు. ఈ పత్రాల ఆధారంగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ఫిర్యాదు చేయడంతో లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో తెల్లాపూర్, చిక్కడపల్లి, ఎస్ఆర్ నగర్, మెహిదీపట్నం, బర్కత్‌పురా ప్రాంతంలోని 8 ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఈ ఫోర్జరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆయా కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఇదే తరహాలో సమర్పించిన మరో 60 ప్రైవేటు కాలేజీ ఫైర్ ఎన్‌ఓసీలను కూడా అధికారులు స్క్రూటినీ చేస్తున్నారు. వాటి ప్రామాణికతపై విచారణ కొనసాగుతోందని, దర్యాప్తులో మరిన్ని అక్రమాలకు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# రూ.80 లక్షల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన





**అభివృద్ధి నిరోధకులను ప్రజలు తిరస్కరించాలని పిలుపు**

**హనుమకొండ, 5 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా కాజీపేట దర్గా రోడ్‌కు సంబంధించిన మూడు దశాబ్దాల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. 48వ డివిజన్ పరిధిలో రూ.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, అలాగే దర్గా ఉత్సవాల సమయంలో తాగునీటి సమస్య నివారణ కోసం రూ.30 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాజీపేట దర్గా రోడ్ సమస్య దశాబ్దాలుగా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. బోడగుట్ట, కడిపికొండ, ఇందిరానగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే వేలాది మంది ప్రజలు ఈ రహదారిపై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. గతంలో ఈ సమస్యపై అనేక ఆందోళనలు, ధర్నాలు, పోలీసు పికెటింగ్‌లు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. దర్గా పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో సమస్యకు పరిష్కారం లభించడం సంతోషకరమని పేర్కొన్న ఎమ్మెల్యే, నెల రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా ఆర్ఈసీ రోడ్ నుంచి బయటకు వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధికి సుమారు రూ.20 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని, ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో పాటు సంబంధిత మంత్రులతో కూడా చర్చలు జరిపినట్లు వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి గల్లీలో రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అయితే అభివృద్ధిని చూసి ఓర్వలేని కొందరు ప్రతిపక్ష నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దర్గా రోడ్, కాజీపేట బస్టాండ్, రైల్వే ఓవర్ బ్రిడ్జి వంటి దశాబ్దాల సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టులను కూడా కావాలనే అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చే అభివృద్ధి నిరోధకులను ప్రజలు గుర్తించి తిరస్కరించాలని పిలుపునిచ్చారు. వరంగల్ నగర అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, గత రెండున్నర సంవత్సరాల్లో అనేక కీలక సమస్యలకు పరిష్కారం చూపామని ఎమ్మెల్యే తెలిపారు. ముప్పై ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్న ప్రభుత్వ పనితీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అనంతరం ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన పోతురవేణ శివకుమార్ కుటుంబానికి విద్యుత్ శాఖ ద్వారా మంజూరైన రూ.5 లక్షల ఆర్థిక పరిహార చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ కుసూర్ పాషా, మాజీ కార్పొరేటర్లు సత్రాజ్ బేగం, అబూబకర్, జక్కుల రవీందర్, డివిజన్ అధ్యక్షుడు రవి, నాయకులు అంకుష్, మట్టెడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం : గాదగోని రవి





**ఎంసిపిఐ(యు) హనుమకొండ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ప్రభుత్వాలపై విమర్శలు**
**ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేపడతామని వెల్లడి**


**ప్రగతి సింగారం, 5 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి విమర్శించారు. ప్రగతి సింగారం గ్రామంలో పెద్ది రెడ్డి మహేందర్ రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఎంసిపిఐ(యు) హనుమకొండ జిల్లా పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హైటెక్ హంగులతో అభివృద్ధి చెందుతున్న హనుమకొండ మహానగరంలోనూ మధ్యతరగతి కాలనీలు, పేద ప్రజల మురికివాడల్లో మౌలిక సమస్యలు కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. వర్షాకాలంలో నగరం జలమయం కావడం, ఇళ్ల స్థలాల సమస్య, మౌలిక వసతుల కొరత వంటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాలు బలహీనపడటం వల్లే సమస్యల పరిష్కారం ఆలస్యమవుతోందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో పాటు ఇతర ప్రజా సంక్షేమ పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలు, ప్రజారోగ్య అంశాలపై భవిష్యత్తులో ఎంసిపిఐ(యు) ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని, వాటిలో ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. బీజేపీ పాలన దేశ సమైక్యత, సమగ్రతకు విఘాతం కలిగించే విధంగా ఉందని ఆరోపించారు. ప్రజల సంపద కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో కేంద్రీకృతమవుతోందని, భారీ అప్పులతో పేదరికం పెరుగుతోందని అన్నారు. మతోన్మాద, మనువాద విధానాలతో ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పార్టీ పోరాట కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. సమావేశంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వల్లేపు ఉపేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎన్. హంసారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, కర్ర రాజిరెడ్డి, మలోతు రాజేష్ నాయక్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చీపురు ఓదయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఎం.డి. ఉస్మాన్, కుసం బుచ్చయ్య, వక్కల కిషన్, మంద భద్రయ్య, బలుగూరి రాజేశ్వరరావు, బలుగూరి ప్రభాకర్ రావు, కునూరి వెంకటేశ్వరరావు, అన్నబోయిన ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

# వీసీఐ మహిళా విశ్వవిద్యాలయంలో.. నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

**హైద్రాబాద్, 5 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

వీరనారి చాకలి ఇలమ్మ మహిళా విశ్వవిద్యాలయం (వీసీఐడబ్ల్యూయూ)లో చాలా కాలంగా కొనసాగుతున్న నీటి సరఫరా సమస్యల పరిష్కారానికి యాజమాన్యం కీలక చర్యలు చేపట్టింది. విద్యార్థినుల వసతి గృహాలు, విద్యా విభాగాలు, ప్రయోగశాలలు, ఇతర విభాగాలకు నిరంతరాయంగా నీటి సరఫరా అందించేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ) అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో విశ్వవిద్యాలయ గౌరవ ఉపకులపతి ప్రొఫెసర్ సూర్య ధనంజయ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గడ్డం మల్లేశం పాల్గొని క్యాంపస్‌లో నెలకొన్న నీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సామ్రాట్ అశోక్ రోజువారీ నీటి సరఫరా గంటలను పెంచడం, నీటి ఒత్తిడిని మెరుగుపరచడం, సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, పైప్‌లైన్ ఆధునీకరణ వంటి అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ అధికారులు విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న పైప్‌లైన్ స్థానంలో అధిక సామర్థ్యం గల కొత్త పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పనులు పూర్తయితే విద్యా భవనాలు, విద్యార్థినుల హాస్టళ్లు, ఇతర విభాగాలకు నిరంతర నీటి సరఫరా అందే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ. సూర్య ధనంజయ్, రిజిస్ట్రార్ ప్రొ. గడ్డం మల్లేశం, ఓఎస్డీ ప్రొ. విజయలక్ష్మి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ ప్రొ. శశికళలు హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సామ్రాట్ అశోక్‌ను సత్కరించి, ప్రతిపాదిత పనులను అత్యవసరంగా చేపట్టాలని విజ్ఞప్తి పత్రాన్ని అందజేశారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రోజువారీ నీటి సరఫరా గంటలను పెంచడంతో పాటు నీటి ఒత్తిడిని మెరుగుపరచడం, అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ అధికారులు హామీ ఇచ్చారు. దీంతో విశ్వవిద్యాలయంలో నెలకొన్న దీర్ఘకాలిక నీటి సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

# డా. సోల్తి కిరణ్ కుమార్ గౌడ్‌కు ఘన సన్మానం

**జై గౌడ్ ఉద్యమం ఆధ్వర్యంలో సత్కారం**
**విద్యారంగం, శారీరక విద్యాభివృద్ధికి అందిస్తున్న సేవలను కొనియాడిన ప్రముఖులు**



**కేయూ క్యాంపస్, 5 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

విద్యారంగంలో, ముఖ్యంగా శారీరక విద్యాభివృద్ధికి విశేష సేవలు అందిస్తున్న డా. సోల్తి కిరణ్ కుమార్ గౌడ్‌కు జైగౌడ్ ఉద్యమం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. జైగౌడ్ ఉద్యమం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మార్క రవి గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ఈసీ సభ్యుడు డాక్టర్ చిర్రా రాజు గౌడ్, కాకతీయ యూనివర్సిటీ బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ బొడిగే సతీష్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగిరి యాదగిరి గౌడ్, అనంతుల రమేష్ గౌడ్, జూలూరి రంజిత్ గౌడ్, కునూరు రంజిత్ గౌడ్, బీసీ సంఘం నాయకులు చిర్రా సుమన్, మధు, నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. సోల్తి కిరణ్ కుమార్ గౌడ్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అలాగే ఇటీవల ఐనవోలు మండల అధ్యక్షుడిగా ఎన్నికైన మోహన్ గౌడ్‌ను కూడా శాలువాతో సత్కరించారు. సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ, డా. సోల్తి కిరణ్ కుమార్ గౌడ్ విద్యారంగంలో, ముఖ్యంగా శారీరక విద్యాభివృద్ధికి అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని ప్రశంసించారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, క్రీడల అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి సమాజానికి విశిష్ట సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, బీసీ సంఘం ప్రతినిధులు, విద్యావేత్తలు, అధ్యాపకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని డా. సోల్తి కిరణ్ కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంచాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్**




**వరంగల్, 5 ఆగస్టు 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

విద్యార్థులు భవిష్యత్తులో సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండాలంటే వారికి చిన్నప్పటి నుంచే సైబర్ భద్రతపై అవగాహన కల్పించడం ఉపాధ్యాయుల బాధ్యత అని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ అన్నారు. 'సురక్షా కా తిరంగా' కార్యక్రమంలో భాగంగా సెంట్రల్ పోలీసుల ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, ప్రజలు అవగాహన ఉన్నప్పటికీ అత్యాశ, భయం, అత్యవసర పరిస్థితులను ఆసరాగా చేసుకుని మోసగాళ్లు కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని పేర్కొన్నారు. సైబర్ విభాగం అధికారులు వివిధ రకాల ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్, ఫేక్ లింకులు, నకిలీ మెసేజ్‌లు, ఓటీపీ మోసాల గురించి ఉపాధ్యాయులకు వివరించారు. అలాగే పోలీస్ జాగృతి కళాబృందం సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యం కల్పించింది. సెల్‌ఫోన్ వినియోగంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింకులు, ఫోటోలు, ఫైళ్లపై క్లిక్ చేయకూడదని, వ్యక్తిగత సమాచారం, ఫోటోలను సోషల్ మీడియాలో విచక్షణారహితంగా పంచుకోవడం వల్ల తీవ్ర నష్టాలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతి మొబైల్ వినియోగదారు తమ ఫోన్‌లోని ప్రైవసీ సెట్టింగ్‌లను తప్పనిసరిగా సురక్షితంగా మార్చుకోవాలని, పిల్లలకు ప్రైవేట్ లైఫ్, పబ్లిక్ లైఫ్ మధ్య తేడాను వివరించి డిజిటల్ భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆన్‌లైన్ కొనుగోళ్లు, డిజిటల్ చెల్లింపుల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని కూడా సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించగా, సైబర్ భద్రతపై రూపొందించిన అవగాహన పోస్టర్లను పోలీస్ కమిషనర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, విద్యాశాఖ సీఎంఓ సుమ, ఏసీపీలు నర్సింహరావు, వెంకటరమణ, జాన్ నర్సింహులు, ఇన్‌స్పెక్టర్లు రజిత్, శివకుమార్, రవికుమార్, అశోక్, ప్రవీణ్ కుమార్ తదితర పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

# హైదరాబాద్‌లో టీజీసీపీజీఈటీ-2026 ఫలితాల విడుదల




**హైద్రాబాద్, 5 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలోని పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీసీపీజీఈటీ--2026 ప్రవేశ పరీక్ష ఫలితాలను బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ ఉన్నత విద్యా మండలి (టిజీసీహెచ్‌ఈ) కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి (టిజీసీహెచ్‌ఈ) చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్, టీజీసీపీజీఈటీ--2026 చైర్మన్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం, కార్యదర్శి ప్రొఫెసర్ వెంకటేశం, కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామ్‌చంద్రం, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ప్రొఫెసర్ వెంకటరామ్ రెడ్డి, టీజీసీపీజీఈటీ--2026 కన్వీనర్ ప్రొఫెసర్ రాజేందర్ కట్ల, మాజీ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా టీజీసీపీజీఈటీ యూనివర్సిటీ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఆచార్య హనుమంతు, ఆచార్య సురేష్‌లాల్, ఆచార్య వెంకయ్య, ఆచార్య జ్యోతి, ఆచార్య సి.జె. శ్రీలత తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు టీజీసీపీజీఈటీ--2026 పరీక్ష నిర్వహణ, మూల్యాంకన ప్రక్రియ, ఫలితాల విడుదలకు సంబంధించిన అంశాలను వివరించారు. అలాగే పీజీ ప్రవేశాలకు సంబంధించిన సర్టిఫికెట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్లు, కౌన్సెలింగ్, సీట్ల కేటాయింపు షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఫలితాల ఆధారంగా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల్లో పీజీ ప్రవేశాల ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. అభ్యర్థులు అధికారిక షెడ్యూల్‌ను అనుసరించి ప్రవేశాల ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు.

# తిమ్మాపూర్‌లో రైతులకు వ్యవసాయ సాంకేతికతలపై అవగాహన

**ఆర్‌ఎడబ్ల్యూఈపి విద్యార్థులు రూపొందించిన పిఆర్‌ఎ నమూనాల పరిశీలన**



**వరంగల్, 5 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

ఐసీఏఆర్-పీవీఎన్‌ఆర్ తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం (పి.వి.ఎన్.ఆర్.టి.వి.యూ) పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), మామునూరు ఆధ్వర్యంలో గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమం (ఆర్.ఎ.డబ్ల్యూ.ఈ.పి)లో భాగంగా తిమ్మాపూర్ గ్రామంలో రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విద్యార్థులు రైతులతో కలిసి పొలాలను సందర్శించి పంటల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, సాగులో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. పంటల నిర్వహణ, కీటకాలు--తెగుళ్ల నివారణ, పశుసంవర్ధక నిర్వహణతో పాటు వివిధ వ్యవసాయ సాంకేతిక అంశాలపై రైతులకు సూచనలు అందించారు. అనంతరం గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు రూపొందించిన పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్ (పిఆర్‌ఎ) నమూనాలు, చార్ట్‌లు, గ్రామ విశ్లేషణ సాధనాలను కృషి విజ్ఞాన కేంద్రం మామునూరు సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డా. అరుణ జ్యోతి ఇతర శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలను అభినందించిన ఆమె, గ్రామీణ పరిస్థితులను సమగ్రంగా అర్థం చేసుకోవడంలో, రైతుల సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలను రూపొందించడంలో పిఆర్‌ఎ సాధనాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధికి తోడ్పడే విధంగా మరింత సమర్థవంతమైన విస్తరణ కార్యక్రమాలు నిర్వహించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ కార్పొరేటర్ అనిత రంజిత్, కేవీకే అధిపతి డా. అరుణ జ్యోతి, డా. విజయ్ భాస్కర్ (పశు పోషణ), డా. అగుర్ల రాజు (సస్య రక్షణ), డా. జి. గణేష్ (ఆక్వాకల్చర్), డా. జె. సాయి కిరణ్ (పశుసంవర్ధక శాస్త్రం), ఆర్.ఎ.డబ్ల్యూ.ఈ.పి విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

# గొర్లకు సొల్లు టీకాలు

**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**



ఐనవోలు మండల కేంద్రం ఒంటిమామిడిపల్లి గ్రామంలో ఈ రోజు గొర్లకు, మేకలకు,డాక్టర్ గిరి ఆధ్వర్యంలో సొల్లు టీకాలు వేశారు.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథి జీఎంపీఎస్ (గొర్రెల మేకల పేపంపకం దారుల సంఘము మండల కార్యదర్శి నల్లబెట్ట చిన్న రాజు యాదవ్ మాట్లాడుతూ.. అతి త్వరలో నట్టల మందు కూడా వచ్చేవిదంగా చూడాలని వెటర్నని డాక్టర్లకు చూచించారు, అదేవిందంగా ప్రభుత్వం హాస్పిటల్ కి అటెండర్ నీ కూడా ఏర్పాటు చేయాలనీ ప్రభుత్వం న్ని కోరడం జరుగుతుంది,ఈ కార్యక్రమం లో పాల్గొన్న వారు,దద్దు మల్లయ్య, రాజారపు రమేష్, రాజారపు సమ్మయ్య, రాజారపు రాంచ్రంద్రు, డాక్టర్ ఎల్లం ఎల్లేశం, తదితరులు పాల్గొన్నారు

# కిట్స్ వరంగల్‌లో ఖాదీ-గ్రామీణ పరిశ్రమల ప్రజా విద్యా కార్యక్రమం






**హసన్ పర్తి, 5 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్), వరంగల్‌లో ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రజా విద్యా కార్యక్రమం' విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి తెలిపారు. కిట్స్‌కు చెందిన లిటరరీ అండ్ ఎక్స్‌ట్రామ్యూరల్ క్లబ్, స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల (ఎస్.వి.బి.సీ) క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని సిల్వర్ జూబ్లీ సెమినార్ హాల్‌లో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ, చైర్‌పర్సన్ సురభి వాణిదేవి ఖాదీ, గ్రామోద్యోగాల ప్రాముఖ్యతను వివరించారు. గాంధేయ సిద్ధాంతాలు, స్వావలంబన, గ్రామీణ పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులు సృజనాత్మక ఆలోచన, భావ వ్యక్తీకరణ, విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న తెలంగాణ కేవీఐసీ డైరెక్టర్ డాక్టర్ లంకా మనోజ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వారానికి కనీసం ఒక్కరోజైనా ఖాదీ వస్త్రాలు ధరించాలని పిలుపునిచ్చారు. చిన్న తరహా పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని, వ్యర్థాల ఆధారిత ఉత్పత్తులు, తేనె పరిశ్రమ, పసుపు, చింతపండు పరిశ్రమలు, జీవవిచ్ఛిన్నమయ్యే ఉత్పత్తుల తయారీ వంటి రంగాల్లో యువతకు మంచి అవకాశాలు ఉన్నాయని వివరించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సెమీకండక్టర్ విధానానికి అనుగుణంగా కిట్స్‌లో ఈసీవీ -- విఎల్ఎస్ఐ (డిజైన్ అండ్ టెక్నాలజీ) పేరుతో కొత్త బీటెక్ కోర్సును ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన 155 మంది విద్యార్థులు పాల్గొని గ్రామీణాభివృద్ధి, దేశ నిర్మాణం, స్వావలంబన వంటి అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తీకరించారని చెప్పారు. కిట్స్ వరంగల్ ఉపాధ్యక్షులు, వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్ఠాన్ కార్యదర్శి వొడితల కిషన్‌రావు మాట్లాడుతూ సంప్రదాయ పరిశ్రమలకు ఆధునిక సాంకేతికతను జోడించి యువత స్టార్టప్‌ల దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఎంఎస్ఎంఈ -- ఎస్.ఎఫ్.యూఆర్. టి.ఐ పథకాల కింద ఖాదీ ప్రాజెక్టులకు రూ.2.5 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఆర్థిక సహాయం అందుబాటులో ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కిట్స్ వరంగల్ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు, కోశాధికారి పి. నారాయణరెడ్డి, అదనపు కార్యదర్శి వొడితల సతీష్ కుమార్ అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ జి. రమేష్, కేవీఐసీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్. లతాదేవి, కిట్స్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ పి. రమేష్ రెడ్డి, స్టూడెంట్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ కె. శ్రీధర్, అధ్యాపక సమన్వయకర్తలు, వివిధ విభాగాల డీన్లు, అధ్యాపకులు, పీఆర్‌ఓ డాక్టర్ డి. ప్రభాకరాచారితో పాటు సుమారు 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆకర్షణీయమైన పెట్టుబడి ప్రకటనలతో మోసపోవద్దు

**వరంగల్ సీపీ ఎన్. శ్వేత హెచ్చరిక**

**కాజీపేట, 5 ఆగస్టు 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**





సామాజిక మాధ్యమాల్లో కనిపించే ఆకర్షణీయమైన పెట్టుబడి ప్రకటనలను నమ్మి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ప్రజలను హెచ్చరించారు. జాతీయ సైబర్ జాగృతి దివస్ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సురక్షా కా తిరంగా -- సైబర్ ఇండిపెండెంట్ తెలంగాణ వైపు" రాష్ట్రవ్యాప్త అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం కాజీపేట పోలీసులు ఎన్ఐటీ వరంగల్‌లో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీ శ్వేత కళాశాల అధ్యాపకులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా స్టాక్ ట్రేడింగ్, ఆన్‌లైన్ పెట్టుబడుల పేరిట జరుగుతున్న మోసాలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. "100 శాతం గ్యారంటీ రాబడి", "డైలీ ప్రాఫిట్", "ఇన్‌సైడర్ టిప్స్", "ప్రత్యేక పెట్టుబడి అవకాశాలు" వంటి తప్పుడు హామీలతో ప్రజలను ఆకర్షిస్తున్నారని తెలిపారు. నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, నకిలీ వెబ్‌సైట్లు, వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా ప్రారంభంలో నకిలీ లాభాలను చూపించి, అనంతరం మరింత పెట్టుబడి పెట్టేలా ప్రలోభపెట్టి చివరకు ప్రాసెసింగ్ ఫీజు, అప్‌గ్రేడేషన్ ఛార్జీలు తదితర పేర్లతో భారీగా డబ్బులు దోచుకుంటున్నారని హెచ్చరించారు. అలాగే నకిలీ ఆర్థిక సలహాదారులు, కంపెనీ ప్రతినిధులుగా నటిస్తూ చట్టబద్ధ అనుమతులు లేని సంస్థల ద్వారా ప్రజల నుంచి పెట్టుబడులు సేకరించి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రజలు అధిక లాభాల ఆశ చూపే పెట్టుబడి పథకాలను గుడ్డిగా నమ్మరాదని, పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థ లేదా బ్రోకర్ అధికారికంగా నమోదు అయి ఉందో లేదో తప్పనిసరిగా ధృవీకరించాలని సూచించారు. సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్ లేదా అపరిచిత వ్యక్తులు ఇచ్చే పెట్టుబడి సలహాలను నమ్మకూడదని, తొందరపెట్టి పెట్టుబడి పెట్టమని ఒత్తిడి చేసే వారిని విశ్వసించరాదని చెప్పారు. పెట్టుబడి పెట్టే ముందు కుటుంబ సభ్యులు లేదా అర్హత కలిగిన ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్కు కాల్ చేయాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సీపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలపై రూపొందించిన అవగాహన వాల్ పోస్టర్లను సీపీ శ్వేత ఆవిష్కరించారు. అనంతరం సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటామని విద్యార్థులు, అధ్యాపకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ డా. ప్రొఫెసర్ సుబుధి, సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, రిజిస్ట్రార్ సునీల్ మెహతా, ఏసీపీలు ప్రశాంత్ రెడ్డి, వెంటరమణ, జాన్ నర్సింహులు, ఇన్‌స్పెక్టర్లు శ్యామ్ సుందర్, అశోక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**






**వరంగల్, 5 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అవగాహన ద్వారానే సైబర్ మోసాలను అరికట్టగలమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. వరంగల్ కలెక్టరేట్‌లో బుధవారం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, వరంగల్ పోలీస్ కమిషనరేట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "సురక్షా కా తిరంగా" సైబర్ భద్రత అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఆదేశాల మేరకు ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డిజిటల్ లావాదేవీలు వేగంగా పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతులతో ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా బిజినెస్, ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల ఆఫర్లు, లోన్ యాప్‌లు, మ్యాట్రిమోనీ వెబ్‌సైట్ల ద్వారా జరిగే మోసాల విషయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తులతో బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి, సంబంధిత ఫిర్యాదును నమోదు చేయడంతో పాటు ౩౩౩.ఎఎవతీఎతీఱఎవ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సురక్షితమైన డిజిటల్ సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడి పాత్ర కీలకమని పేర్కొన్న కలెక్టర్, కుటుంబ సభ్యులు, విద్యార్థులు, యువతలో సైబర్ భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సైబర్ నేరాల నివారణ, భద్రతా చర్యలు, తాజా మోసాల విధానాలపై జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీఆర్‌వో విజయలక్ష్మి, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, డీఎస్పీ ఎం. వెంకటరత్నం, ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎస్‌ఐలు శివ, చరణ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలం

**డిసిసి ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**

**హనుమకొండ : (జై భీమ్ న్యూస్)**

కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ టీపీసీసీ ఆదేశాల మేరకు బూత్, విలేజ్, మండల స్థాయి కమిటీల నియామక ప్రక్రియను వేగవంతం చేసేందుకు డీసీసీ కార్యాలయంలో కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీకి అసలైన బలం క్షేత్రస్థాయిలో ఉండే కార్యకర్తలేనని... రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నా, మన ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నా ఈ కమిటీల నియామకం అత్యంత కీలకమని అన్నారు. అధిష్టానం మనకు ఇచ్చిన గడువు చాలా తక్కువగా ఉన్నందున, మనమందరం పూర్తి బాధ్యతతో పనిచేసి నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. అన్ని బూత్, విలేజ్ మరియు మండల కమిటీల ఏర్పాటు ప్రక్రియను రాబోయే ఆగస్టు 15వ తేదీ లోపు తప్పకుండా పూర్తి చేయాలని, ఏ మండల కమిటీలోనైనా సరే మొత్తం సభ్యుల సంఖ్య 21 మందికి మించకూడదు. ఇందులో డీసీసీ అధ్యక్షుడి కోటా కింద ప్రతి మండల కమిటీలో కనీసం ఐదుగురు సభ్యులను నామినేట్ చేసే వెసులుబాటు మరియు ఒక ఉపాధ్యక్షుడిని నియమించే అవకాశం ఉంది కాబట్టి, మండల అధ్యక్షులు ఈ విషయంలో నాతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. కమిటీల నియామకం ముగిసిన వెంటనే, ఆగస్టు 15 నుండి ఆగస్టు 31 మధ్యలోనే ఆయా మండలాల్లో తొలి అధికారిక మండల కమిటీ సమావేశాన్ని కూడా విజయవంతంగా నిర్వహించాలని సూచించారు, కమిటీల నియామకం ప్రక్రియలో మండల అధ్యక్షులు మరియు ఇంచార్జ్ కమిటీ సభ్యులు మీయొక్క నియోజకవర్గ ఎమ్మెల్యేల సూచనలు తీసుకొని ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ, ఎలాంటి వివాదాలకు తావులేకుండా అర్హులైన, కష్టపడే నాయకులకు కమిటీల్లో చోటు కల్పించాలని కోరుతున్నాను. ఏఐసీసీ ఆదేశాల ప్రమాణాలు పాటించని కమిటీలకు డీసీసీ అధ్యక్షుడిగా నేను ఆమోదం తెలపడం సాధ్యం కాదని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెసటీపీసీసీ జనరల్ సెక్రెటరీ, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి పల్లె శ్రీనివాస్ గౌడ్, టిఫిసిసి అధికార ప్రతినిధి, వర్ధన్నపేట ఇంచార్జి శ్రీమతి కూచన రవళి పాల్గొన్నారు. ఐనవోలు మండల అధ్యక్షులు మోహన్ గౌడ్, ఇన్చార్జులు నాగరాజు ,హన్మకొండ జిల్లా జెబిఎం అధ్యక్షులు జన్నపురెడ్డి ఋగ్వేద రెడ్డి,ఐనవోలు మండల ఇన్చార్జులు.. నాగరాజు,ఇబ్రహీం,పులి శ్రీనివాస్,సుగుణ కిషోర్ పాల్గొన్నారు..



# ఎట్టకేలకు దిగివచ్చిన మెటా

**ప్రధాని మోడీకి జుకర్ బర్గ్ క్షమాపణలు**
**కంటెంట్‌ల బూస్ట్‌కు డబ్బులు తీసుకున్నట్లు అంగీకారం**

**న్యూఢిల్లీ,ఆగస్ట్5(జై భీమ్ న్యూస్):**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియో తొలగింపుపై మెటా దిగొచ్చింది. ఈ మేరకు మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్.. ప్రధాని మోదీకి బహిరంగ క్షమాపణలు చెప్పారు. సీఎస్ఏఎమ్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తిపై విచారం వ్యక్తం చేసిన మెటా.. కొన్ని రకాల కంటెంట్‌ను బూస్ట్ చేయడానికి భారీగా డబ్బులు తీసుకున్నట్టు అంగీకరించింది. అంతే కాకుండా తమ ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లను కూడా అంగీకరించింది. ప్రధాని మోదీకి సంబంధించిన జులై 23 నాటి వీడియోను తొలగించడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మెటాను పార్లమెంటరీ కమిటీ బుధవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం సహా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మూడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు దిగొచ్చిన మెటా.. మోదీకి క్షమాపణలు చెప్పింది. ప్రధాని నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ పోస్టు తాత్కాలికంగా తొలగించిన వ్యవహారం మెటాకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం సమన్లు జారీ చేయడంతో మెటా గ్లోబల్ బృందం బుధవారం కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఉన్నతాధికారులతో సమావేశమైంది. దాదాపు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మెటా గ్లోబల్ వ్యవహారాల అధికారి జోయెల్ కాప్లన్ నేతృత్వంలోని బృందం ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. అలాగే కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కూడా మెటా బృందం కలిసింది. జూలై 23న ప్రధాని నరేంద్ర మోదీ యువతను ఉద్దేశించి పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పిన వీడియోను ఫేస్‌బుక్ కొంతసేపు పరిమితం చేసింది. అనంతరం అది సాంకేతిక లోపం వల్ల జరిగిందని మెటా వివరణ ఇచ్చి పోస్టును పునరుద్ధరించింది. అయితే ఈ వివరణను కేంద్ర ప్రభుత్వం సరిపోదని స్పష్టం చేసింది. సమావేశంలో ప్రధాని పోస్టు వ్యవహారంతో పాటు ఇన్‌స్టాగ్రామ్‌లో పిల్లలపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్, ప్రకటనలు, కృత్రిమ మేధతో రూపొందించిన తప్పుడు సమాచార నియంత్రణ వంటి అంశాలపై కూడా కేంద్రం ప్రశ్నలు సంధించింది. ప్రముఖ వ్యక్తుల ధృవీకరించిన ఖాతాల్లోని పోస్టులను తొలగించే ముందు మరింత భద్రతా వ్యవస్థ ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. మెటా అల్గోరిథమ్ ఎలా పనిచేస్తోంది? పోస్టులు ఏ ప్రాతిపదికన తొలగించబడుతున్నాయి? భారత చట్టాలకు అనుగుణంగా వ్యవస్థ ఎలా పనిచేస్తుంది? వంటి అంశాలపై కూడా ప్రభుత్వం వివరణ కోరింది. దేశ భద్రత, ప్రజా శాంతి వంటి అంశాలకు సంబంధించిన విషయాల్లో సోషల్ మీడియా వేదికలు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ వీడియో తొలగింపును తీవ్రంగా పరిగణించిన పార్లమెంటరీ స్థాయి సంఘం మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. నిర్దేశిత గడువులో స్పందించకపోతే భారతదేశంలో మెటాకు లభిస్తున్న 'సేఫ్ హార్బర్' రక్షణను పునఃపరిశీలించే అవకాశం ఉందని హెచ్చరించింది. సోషల్ మీడియా సంస్థలు భారత చట్టాలను పూర్తిగా పాటించాల్సిందేనని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా మెటా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించినట్లు సమాచారం.

# సిఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన

**షరతులతో అనుమతిచ్చిన ఎసిబి కోర్టు**

హైదరాబాద్,ఆగస్ట్5(జై భీమ్ న్యూస్): సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం, ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించేందుకు అనుమతించింది. ఇందుకోసం కోర్టు కస్టడీలో ఉన్న ఆయన పాస్‌పోర్టులను తాత్కాలికంగా విడుదల చేయాలని ఆదేశించింది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యంతో విదేశీ పర్యటన చేపడుతున్నట్లు రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పాస్‌పోర్టులను తాత్కాలిక కస్టడీకి ఇవ్వడంతో పాటు విదేశీ ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు పిటిషన్‌ను పాక్షికంగా అనుమతించింది. విదేశీ పర్యటనకు అనుమతి ఇస్తూనే కోర్టు పలు షరతులు విధించింది. లక్ష వ్యక్తిగత బాండ్‌తో పాటు ఒక ష్యూరిటీ సమర్పించాలని ఆదేశించింది. విదేశీ పర్యటనకు సంబంధించిన పూర్తి ప్రయాణ వివరాలు, అక్కడ బస చేసే చిరునామాలు, సంప్రదింపు ఫోన్ నంబర్లు కోర్టుకు అందజేయాలని పేర్కొంది. అలాగే, సెప్టెంబర్ 18లోగా పాస్‌పోర్టులను తిరిగి కోర్టులో జమ చేస్తానని అఫిడవిట్ దాఖలు చేయాలని రేవంత్ రెడ్డిని ఆదేశించింది. ఆ అఫిడవిట్ సమర్పించిన అనంతరం ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారికి లేఖ రాసి పాస్‌పోర్టులను తాత్కాలికంగా అప్పగించాలని కోర్టు ఆదేశాల్లో పేర్కొంది.

# జగన్‌పై అవినీతి కేసులపై రాజ్యసభలో టిడిపి ప్రస్తావన

**13 ఏళ్లవుతున్నా తేలడం లేదంటూ ఎంపి విజయ్ వెల్లడి**
**సుప్రీం జడ్జిల బిల్లుపై చర్చలో ప్రస్తావనను ఆక్షేపించిన డిప్యూటి ఛైర్మన్**

**న్యూఢిల్లీ,ఆగస్ట్5(జై భీమ్ న్యూస్):**

పార్లమెంట్, రాజ్యసభలో ప్రతిపాదించిన 'సుప్రీంకోర్టు న్యాయమూర్తుల (సవరణ) బిల్లు – 2026'పై మాట్లాడే క్రమంలో జగన్ కేసుల విషయాన్ని తెలుగుదేశం పార్టీ ఎంపీ చింతకాయల విజయ్ ప్రస్తావించారు. దాదాపు కొన్నేళ్లుగా కేసుల విషయంలో జరుగుతున్న జాప్యాన్ని ప్రస్తావించారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కు పెంచడం సకాలంలో తీసుకున్న అభినందనీయమైన నిర్ణయమని పేర్కొన్నారు. సత్వర న్యాయం అందించే దిశగా ఈ-కోర్టులు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీని, అమరావతిలో జ్యుడీషియల్ మౌలిక వసతుల కల్పనకు విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌ను ఎంపీ విజయ్ సభలో ప్రముఖంగా ప్రశంసించారు. చట్టం ముందు సామాన్యులైనా, అత్యంత బలవంతులైనా సమానులేనని, న్యాయం ఆలస్యం అవడమంటే న్యాయం నిరాకరించినట్లేనని ఎంపీ విజయ్ స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులను ఆయన రాజ్యసభ సాక్షిగా ప్రస్తావించారు. జగన్‌పై 2013లో నమోదైన సీబీఐ, ఈడీ కేసులు 13 ఏళ్లు గడుస్తున్నా విచారణ ముందుకు సాగలేదని ప్రశ్నించారు. డిశ్చార్జ్ పిటిషన్లు, న్యాయమూర్తుల బదిలీల సాకుతో ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సకాలంలో విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సుదీర్ఘ జాప్యాల వల్ల న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుందని ఎంపీ విజయ్ కుండబద్దలు కొట్టారు. అయితే డిప్యూటీ ఛైర్మన్ ఈ వ్యాఖ్యల ప్రస్తావనను ఆక్షేపించారు. బిల్లుపై మాత్రమే మాట్లాడాలని అన్నారు. భారత జనాభా 150 కోట్లకు చేరుకున్న ప్రస్తుత తరుణంలో, సామాన్యులకు సైతం వేగంగా, పారదర్శకంగా న్యాయం అందాలన్నదే తమ ఆకాంక్ష అని ఎంపీ విజయ్ తెలిపారు. ఈ వ్యవస్థపై ప్రజలకు పూర్తి భరోసా కలగాలంటే కేవలం అత్యున్నత న్యాయస్థానంతో పాటు హైకోర్టులు, కిందిస్థాయి కోర్టులు, ముఖ్యంగా ప్రత్యేక సీబీఐ కోర్టులను సైతం ఏకకాలంలో బలోపేతం చేసి తీర్పులు వేగవంతం చేయాలని ఎంపీ చింతకాయల విజయ్ డిమాండ్ చేశారు.

# ఎపికి విదేశీ పెట్టుబడుల వెల్లువ

**లోక్‌సభలో వైసిపి సభ్యుడి ప్రశ్నకు కేంద్రం సమాధానం**

**న్యూఢిల్లీ,ఆగస్ట్5(జై భీమ్ న్యూస్):**

ఆంధ్రప్రదేశ్‌కు విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. లోక్‌సభలో లెక్కలతో సహా కేందప్రభుత్వం స్పష్టం చేసింది. లోక్‌సభలో వైసీపీ ఎంపీ అడిగిన ప్రశ్నపై కేంద్రం వివరించింది. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో కంటే కూటమి ప్రభుత్వ పాలనలో భారీగా విదేశీ పెట్టుబడులు పెరిగాయని కేంద్రం తేల్చిచెప్పింది. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో రూ.760 కోట్లుగా (92.13 మిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐలు ఉన్నాయని వెల్లడించింది. 2024-25 నాటికి 233.14 మిలియన్ డాలర్లకు విదేశీ ఈక్విటీ పెట్టుబడులు పెరిగాయని పేర్కొంది. 2025 – 26 నాటికి ఏకంగా రూ.5,000 కోట్లకు పైగా (608.59 మిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐలు ఎగబాకినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వైసీపీ హయాంలో పారిశ్రామిక విధానాల్లో అనిశ్చితి వల్ల పెట్టుబడుల ప్రవాహం వెనకబడిందని చెప్పింది. 2025 – 26లో లోహ పరిశ్రమల రంగంలో అత్యధికంగా 250.67 మిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చినట్లు స్పష్టం చేసింది. ఆహార శుద్ధి రంగంలో 107.30 మిలియన్ డాలర్లు, సిమెంట్ ఉత్పత్తుల రంగంలో 99.90 మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయని పేర్కొంది. సర్వీసెస్, ఆర్అండ్‌డీ పరిధిలోనూ 2025-26లో 59.96 మిలియన్ డాలర్ల పెట్టుబడులు నమోదైనట్లు వెల్లడించింది. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన అనుకూల పారిశ్రామిక విధానాలు, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'తో పెట్టుబడులు ఊపందుకున్నాయని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. వైసీపీ పాలన కంటే కూటమి హయాంలో ఎఫ్‌డీఐల రీసౌండింగ్ గ్రోత్... 92 మిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 608 మిలియన్ డాలర్లకు విదేశీ పెట్టుబడులు చేరాయని వివరించింది. సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్, వేగవంతమైన అనుమతులతో ఏపీ వైపు విదేశీ దిగ్గజ సంస్థలు క్యూ కడుతున్నాయని పేర్కొంది. లోహ, ఆహార శుద్ధి, సిమెంట్ రంగాల్లో భారీ పెట్టుబడులు వచ్చాయని కేంద్రం ప్రభుత్వం స్పష్టం చేసింది.

# ప్రజల భద్రత కోసం చేసిన పనులకు బిల్లులు చెల్లించాలి

**ఎంబీ నమోదు చేయక ఇబ్బంది పెడుతున్నారు.. మానసిక ఆవేదనలో గుంటూరుపల్లి సర్పంచ్ చల్లా రాకేష్ రెడ్డి**



**హసన్‌పర్తి, 5 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని అప్పులు చేసి అత్యవసర పనులు పూర్తి చేసినప్పటికీ, సంబంధిత అధికారులు మెజర్‌మెంట్ బుక్ (ఎంబీ) నమోదు చేయకుండా బిల్లులు నిలిపివేయడంతో తీవ్ర మానసిక ఆవేదనకు గురవుతున్నట్లు గుంటూరుపల్లి గ్రామ సర్పంచ్ చల్లా రాకేష్ రెడ్డి తెలిపారు. బుధవారం హసన్‌పర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. గుంటూరుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న బావి గ్రామ ప్రజలకు, ముఖ్యంగా ప్రతిరోజూ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ప్రాణాపాయంగా మారిందని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వారు స్థలాన్ని పరిశీలించి బావిని పూడ్చివేయాలని సూచించారని చెప్పారు. అనంతరం సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధుల నుంచి రూ.5 లక్షల పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని బిల్లులు మంజూరు కాకముందే అప్పులు చేసి పనులను పూర్తి చేసి బావిని పూడ్చివేసినట్లు రాకేష్ రెడ్డి పేర్కొన్నారు. అయితే పనులు పూర్తై రెండు నెలలు గడిచినా ఇప్పటికీ పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఎంబీ నమోదు చేయకపోవడంతో బిల్లులు విడుదల కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లుల కోసం డివిజన్ కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరిగినా ఫలితం లేకపోయిందని ఆయన తెలిపారు. ప్రజల ప్రాణాలకు ముప్పు తొలగించాలనే ఉద్దేశంతో ముందుగా పనులు పూర్తి చేసిన గ్రామ పంచాయతీకి అధికారులు న్యాయం చేయాలని కోరారు. వెంటనే ఎంబీ నమోదు చేసి పెండింగ్ బిల్లులను విడుదల చేయడంతో పాటు ఈ విషయంలో ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ చల్లా రాకేష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# మండల ప్రత్యేక సమావేశాన్ని బహిష్కరించిన సర్పంచ్లు



**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

ఐనవోలు మండల సర్వసభ్య సమావేశాన్ని బీఆర్ఎస్, బీజేపీ, ఇండిపెండెంట్ సర్పంచులు ఐనవోలు, పున్నెల్, కొండపర్తి, పంతిని, ఒంటిమామిడిపల్లి, కక్కిరాల పల్లి గ్రామాల సర్పంచులు బహిష్కరించారు. ఐనవోలు మండలంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు వ్యవహార శైలికి నిరసనగా బీఆర్ఎస్, బీజేపీ, ఇండిపెండెంట్ సర్పంచులు బహిష్కరించారు. ఈ సందర్భంగా మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గడ్డం రఘువంశీ గౌడ్ మాట్లాడుతూ, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు గారు ప్రతిపక్ష పార్టీలకు చెందిన సర్పంచులను వివక్షకు గురిచేస్తూ, వారికి అభివృద్ధి నిధులు కేటాయించకుండా కేవలం కాంగ్రెస్ పార్టీ సర్పంచులకు మాత్రమే నిధులు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే, ప్రభుత్వ అధికారులు కూడా ప్రోటోకాల్‌ను పాటించకుండా ఎమ్మెల్యే కనుసన్నల్లో పనిచేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు సమాన గౌరవం, అభివృద్ధి నిధులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచులు ఉస్మాన్ అలీ, కాంజర్ల అశోక్ రావు, శ్రీరామ్ భూపాల్, గుండేటి ఏలీయా, ఆడెపు స్రవంతి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

# యాద్గిర్ జిల్లా రసాయన పరిశ్రమలో ప్రమాదం

రాయచూర్,ఆగస్ట్5(జై భీమ్ న్యూస్): కర్ణాటక యాద్గిర్ జిల్లాలోని ఓ రసాయన పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో తెలంగాణ యువకుడు సహ ముగ్గురు యువకులు మరణించారు. మరో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. విషవాయువులు విడుదల కావడంతో బుధవారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి 2 గంటల మధ్యలో ఈ ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలోని విషవాయువులు లీకవ్వడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. విషవాయువులు లీకవ్వడంతో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఐదుగురు కార్మికులు ఒక్కసారిగా అస్వస్థతకు గురవ్వడంతో వారిని రాయచూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)కు తరలించారు. అయితే అప్పటికే ముగ్గురు మృతిచెందినట్లుగా వైద్యులు గుర్తించారు. మృతులను తెలంగాణలోని నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ఆలంపల్లికి చెందిన గణెశిశ్, మధ్యప్రదేశ్‌లోని కట్నీ జిల్లాకు చెందిన విక్రమ్, సంజయ్‌లుగా గుర్తించారు. వీరంతా 20 నుంచి 25 ఏళ్లలోపు వారేనని అధికారులు తెలిపారు. ఇక ఈ ఘటనలో ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన హేమంత్, శివకుమార్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# ప్రదీప్ రావత్ మృతిపై సల్మాన్ ఖాన్ భావోద్వేగ స్పందన



బాలీవుడ్ సీనియర్ నటుడు, తన విలక్షణ నటనతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రదీప్ రావత్ (74) కన్నుమూశారు. కొంతకాలంగా కేన్సర్‌తో పోరాడుతున్న ఆయన, ఆరోగ్యం విషమించడంతో మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. పలువురు సినీ ప్రముఖులు ఆయనకు సోషల్ మీడియా వేదికగా నివాళులర్పిస్తున్నారు.బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ తన స్నేహితుడు, సహనటుడైన ప్రదీప్ రావత్‌ను గుర్తుచేసుకుంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగ పోస్ట్ పెట్టారు. 1990లో వచ్చిన 'బాఘి: ఏ రెబెల్ ఫర్ లవ్' సినిమాలో ప్రదీప్‌తో కలిసి నటించినప్పటి ఫోటోను షేర్ చేశారు. "సోదరా, నీతో ఎన్నో మంచి క్షణాలు పంచుకున్నాను.. నీ ఆత్మకు శాంతి కలగాలి" అని రాసుకొచ్చారు. ఈ చిత్రంలో సల్మాన్ కథానాయకుడిగా నటించగా, ప్రదీప్ 'బుద్ధ' అనే కీలక పాత్రలో కనిపించారు,అలాగే, 'మహాభారత్' సీరియల్‌లో ప్రదీప్ సహనటుడైన సురేంద్ర పాల్ సింగ్ కూడా తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బీఆర్ చోప్రా రూపొందించిన ఈ ఐకానిక్ సిరీస్‌లో ద్రోణాచార్యుడి పాత్ర పోషించిన సురేంద్రపాల్, అశ్వత్థామగా నటించిన ప్రదీప్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "త్వరగా వెళ్లిపోయావు, కానీ నిన్ను ఎప్పటికీ మర్చిపోలేం. నీ అంకితభావం, నటన అద్భుతం. నిజమైన లెజెండ్స్ వారి పనుల ద్వారా చిరస్థాయిగా నిలిచిపోతారు. ఓం శాంతి మిత్రమా" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.నటుడు రితేశ్ దేశ్‌ముఖ్ కూడా ప్రదీప్ రావత్‌ను స్మరించుకున్నారు. "ప్రదీప్ రావత్ గారితో పనిచేసే అదృష్టం నాకు దక్కింది. ఆయనొక నిజమైన జెంటిల్మన్. ఆయన నవ్వితే ఆ గది మొత్తం నవ్వుతో నిండిపోయేది" అంటూ ఆయన గొప్ప వ్యక్తిత్వాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రదీప్ రావత్ తన కెరీర్‌లో ఎన్నో పవర్‌ఫుల్ పాత్రలు, ముఖ్యంగా సై, ఛత్రపతి, గజినీ వంటి చిత్రాల్లో ప్రతినాయకుడి పాత్రలతో ప్రేక్షకులను మెప్పించారు. ఆయన మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటు అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.


# విజయ్ నాకు మంచి మిత్రుడు.. కానీ సీఎం అనే పిలవాలి: మాధవన్

**విజయ్ సీఎం కావడంపై సంతోషం వ్యక్తం చేసిన మాధవన్**

**విజయ్ నాయకత్వంలో తమిళనాట మంచి మార్పు వస్తుందనే నమ్మకం ఉందని వ్యాఖ్య**

**రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం తనకు లేదని వెల్లడి**

తన మిత్రుడు విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రి కావడంపై ప్రముఖ నటుడు ఆర్. మాధవన్ సంతోషం వ్యక్తం చేశారు. తాజాగా ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన... విజయ్ నాయకత్వంలో తమిళనాట త్వరలోనే మంచి మార్పు వస్తుందనే నమ్మకం తనకు కలిగిందని వ్యాఖ్యానించారు. విజయ్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ... తామిద్దరం మంచి స్నేహితులమే అయినప్పటికీ, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఆయనను ఇప్పుడు గౌరవపూర్వకంగా 'సీఎం విజయ్' అనే పిలవాలని అన్నారు. రాజకీయాలను 'రెండు వైపులా పదును ఉన్న కత్తి'గా అభివర్ణించిన మాధవన్... అక్కడ మంచో, చెడో ఏది చేసినా విమర్శించేవారు ఎప్పుడూ ఉంటారని అభిప్రాయపడ్డారు. అలాగే తన రాజకీయ ప్రవేశంపై వస్తున్న ఊహాగానాలకు స్వస్తి చెబుతూ, తనకు ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. ప్రజలను నడిపించాలని లేదా పదవులు చేపట్టాలనే ఆశ తనకు లేదని, సినిమా వృత్తి ద్వారానే సమాజానికి తోడ్పడతానని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రతినిధులను గౌరవించడం పౌరుడిగా తన బాధ్యత అని తెలిపారు. కాగా, పారిశ్రామికవేత్త గోపాలస్వామి దొరైస్వామి నాయుడు (+.ఐ. చీుఱుఎబ) బయోపిక్ ఆధారంగా రూపుదిద్దుకుంటున్న 'జీ.డీ.ఎన్' చిత్రంలో మాధవన్ కథానాయకుడిగా నటిస్తున్నారు.



# ఉదయనిధి స్టాలిన్ సినిమాకు త్రిష నో చెప్పారా?

కొన్నాళ్ల క్రితం హిందూ మతంపై చేసిన వ్యాఖ్యలతో కొన్నాళ్లు వార్తల్లో నిలిచిన డీఎంకే శాసనసభాపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తాజా వివాదంతో మళ్లీ వార్తల్లో కెక్కారు. సినీ నటి త్రిషపై ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన అరెస్టవడం, బెయిల్‌పై విడుదలవడం మనకు తెలిసిందే. ఈ వివాదం నేపథ్యంలో, గతంలో వీరిద్దరి కాంబినేషన్ గురించి వెలువడిన వార్తలు మళ్లీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఉదయనిధి సినిమాలో నటించేందుకు త్రిష నిరాకరించారని, రూ. 12 కోట్ల పారితోషికం ఆఫర్‌ను రిజెక్ట్ చేశారనే ప్రచారం మళ్లీ తెరపైకి వచ్చింది. 2018లో దర్శకుడు కె.ఎస్. అధియమాన్ దర్శకత్వంలో 'ఏంజెల్' అనే టైటిల్‌తో ఒక సినిమా రాబోతుందని, అందులో త్రిష కథానాయికగా నటిస్తోందని వార్తలు రాగా, ఆ వార్తల్లో నిజం లేదని అప్పట్లోనే చిత్ర బృందం స్పష్టం చేసింది. ఇక ఇటీవల ఉదయనిధికి చెందిన రెడ్ జెయింట్ మూవీస్ నిర్మాణంలో నటించేందుకు త్రిషకు రూ. 12 కోట్లు ఆఫర్ చేశారనే వార్త నెట్టింట చక్కర్లు కొట్టినప్పటికీ, దీనిపై త్రిష లేదా రెడ్ జెయింట్ సంస్థ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మీడియా సైతం దీనిని కేవలం ఒక పుకారుగా లేదా నిర్ధారణ లేని అంశంగానే పేర్కొంది. నిజానికి రెడ్ జెయింట్ మూవీస్ నిర్మించిన 'కురువి', 'మన్మథన్ అంబు' వంటి చిత్రాల్లో త్రిష హీరోయిన్‌గా నటించారు. ఉదయనిధి సంస్థతో ఆమెకు మంచి అనుబంధమే ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ఉదయనిధి సరసన త్రిష ఒక్క సినిమాలోనూ నటించలేదు. ఫలితంగా, రూ. 12 కోట్ల ఆఫర్‌ను ఆమె తిరస్కరించారనే వార్త కేవలం ఆధారాలు లేని ప్రచారంగానే మిగిలిపోయింది.







# రాజకీయాలపై శోభిత ధూళిపాళ సంచలన వ్యాఖ్యలు

**తనకు వామపక్ష భావజాలం చాలా ఎక్కువన్న శోభిత**

**భవిష్యత్తులో కమ్యూనిజమే విజయం సాధిస్తుందని వ్యాఖ్య**

**గ్లామర్ ప్రపంచంలో ఉంటూ కమ్యూనిజం గురించి మాట్లాడటం సరికాదంటున్న నెటిజన్లు**

ప్రముఖ నటి, అక్కినేని నాగచైతన్య భార్య శోభితా ధూళిపాళ తన రాజకీయ భావజాలంపై చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియా వ్యాప్తంగా విపరీతమైన చర్చకు దారితీస్తున్నాయి. "నాకు వామపక్ష భావజాలం చాలా ఎక్కువ. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కమ్యూనిజమే కచ్చితంగా విజయం సాధిస్తుంది" అని ఆమె చెప్పిన మాటలు పెను దుమారమే రేపాయి.గ్లామర్ ఇండస్ట్రీలో ఉంటూ, తమ కెరీర్ దెబ్బతింటుందనే భయంతో ఏ హీరోయిన్ కూడా పొలిటికల్ ఐడియాలజీని బయటకు చెప్పేందుకు ఇష్టపడరు. అలాంటిది శోభితా ధూళిపాళ ఎలాంటి దాపరికం లేకుండా, అత్యంత ధైర్యంగా తన మనసులోని అభిప్రాయాలను బయటపెట్టడంపై కొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు. వ్యక్తిగత భావ ప్రకటన స్వేచ్ఛకు గౌరవం ఇస్తూ ఆమె నిజాయతీని కొనియాడుతున్నారు.అయితే, మరికొందరు నెటిజన్లు మాత్రం ఆమె వ్యాఖ్యలపై తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. చిత్ర పరిశ్రమలో నటిగా ఉంటూ, అత్యంత విలాసవంతమైన లైఫ్‌స్టైల్‌ను గడుపుతున్న శోభిత... కమ్యూనిజం గురించి మాట్లాడటం సరికాదని కామెంట్స్ చేస్తున్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఆమె చెప్తున్న సిద్ధాంతాలు ఆచరణాత్మకంగా ఎంతవరకు సాధ్యమని ప్రశ్నిస్తున్నారు.ఇక సినిమాల విషయానికి వస్తే, నాగచైతన్యతో వివాహం తర్వాత కొంత విరామం తీసుకున్న శోభిత..ఆ 'చీకటిలో', 'క్రాస్ రోడ్స్' వంటి ప్రాజెక్టులతో అలరించారు. ప్రస్తుతం ఇవి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం 'సిల్ బట్టా', 'వెట్టువం' వంటి వినూత్న చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.